WWW.KALAMNIGHA.COM

కలం నిఘా
తెలుగు దినపత్రిక

హైదరాబాద్ గురువారం 12 డిసెంబర్ 2024

సంపుటి: 14, సంచిక: 253, పేజీలు 8, వెల: 4.00

Published from : Hyderabad, Karimnagar, Nizamabad, Warangal, Vijayawada, Tirupati, Kurnool, Visakhapatnam

## అమెరికాతో అదానీ పోర్ట్స్...
# రుణ ఒప్పందం ఉపసంహరణ
### 553 మిలియన్ డాలర్ల ఒప్పందం వెనక్కి



న్యూఢిల్లీ డిసెంబర్ 11 (నిఘా న్యూస్) అమెరికా ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ (డీఎఫ్‌సీ)తో కుదుర్చుకున్న 553 మిలియన్ డాలర్ల ఒప్పందాన్ని భారత బిలియనీర్ అదానీకి చెందిన అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనమిక్ జోన్ (ఏపీఎస్ఈజడ్)

..మిగతా 2లో

## ఈ నెల 15, 16న
# గ్రూప్-2 పరీక్షలు






## పదేళ్లలో
# 50 ఎయిర్ పోర్టులు
### 2026 జూన్ నాటికి భోగాపురం విమానాశ్రయం పూర్తి
### కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడి

హైదరాబాద్ డిసెంబర్ 11 (నిఘా న్యూస్) కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం విమానాశ్రయాల అభివృద్ధికి కృషి చేస్తుందని, మరో పదేళ్లలో దేశంలో 50 ఎయిర్ పోర్టులు పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. 2026 జూన్ నాటిక భోగాపురం విమానాశ్రయం పూర్తవుతుందని పేర్కొన్నారు. శంషాబాద్‌లోని నోవాటెల్‌లో బుధవారం జరిగిన ఎయిర్‌పోర్ట్ ప్రిడిక్టివ్ ఆపరేషన్ సెంటర్ ప్రారంభోత్సవంలో రామ్మోహన్ నాయుడు పాల్గొని ప్రసంగించారు. తెలంగాణలోని శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం అభివృద్ధి వెనుక ఏపీ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి ఉందన్నారు రామ్మోహన్ నాయుడు. దాదాపు రెండు దశాబ్దాల కిందట ఐదు వేల ఎకరాల భూసేకరణ అంటే మామూలు విషయం కాదన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టులపై ఫోకస్ చేస్తోందన్నారు. అయితే ఇందుకు చంద్రబాబు ప్లానింగే కారణం అన్నారు. ఇంకా చెప్పాలంటే దేశంలోని ఐటీ విప్లవం వెనక టీడీపీ అధినేత చంద్రబాబు కృషి ఉందన్నారు. ఐటీ ద్వారా దేశం వేగంగా అభివృద్ధి చెందుతుందని చంద్రబాబు నమ్ముతారని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ 'దేశంలో విమానాశ్రయాల నిర్వహణలో బెస్ట్ టెక్నాలజీ

..మిగతా 2లో

## సంక్షోభంలోనే
# అవకాశాలను సృష్టించాలి
### హార్డ్ వర్క్ ముఖ్యం కాదు స్మార్ట్ వర్క్ కావాలి

అమరావతి తొలి దశ నిర్మాణానికి కేంద్రం 15 వేల కోట్లు, బయటనుండి 16 వేల కోట్లు తెస్తున్నామని, మరో 31 వేల కోట్లు మొబలైజ్ చేశామని, ఫైనల్‌గా తొలిదశకు రూ.50 వేల కోట్లు కావాలి : బాబు




- 20 లక్షల మందికి ఉద్యోగాలు ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యం
- గతంలో భూముల్ని మాత్రమే కబ్జా చేసేవాళ్లు
- ఇప్పుడు పోర్టులు, సెజ్‌లను కూడా కబ్జా చేసేస్తున్నారు
- గతంలో అనేక తప్పులు జరిగాయని, తనకు కోపం, కసి ఉంది
- శాటిలైట్ ద్వారా గంజాయి సాగును గుర్తించి డ్రోన్లతో ధ్వంసం చేస్తాం
- విశాఖలో గూగుల్ ఏర్పాటుకు ఎంవోయు కుదిరింది
- ప్రభుత్వ విజన్ డైరెక్షన్ కలెక్టర్‌లకు తెలియజేయడమే సదస్సు ఉద్దేశం
- కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

అమరావతి డిసెంబర్11 (నిఘా న్యూస్) ప్రతి సంక్షోభంలో అవకాశాలు ఉంటాయని, సంక్షోభంలో అవకాశాలు సృష్టించుకోవడమే నాయకత్వమని, ప్రజా చైతన్యమే ప్రజాస్వామ్యానికి శ్రీరామరక్ష అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. బుధవారం కలెక్టర్లతో సీఎం చంద్రబాబు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయత్నాలు చేసిన వెంటనే ఫలితాలు రావని, నిరంతరం ప్రయత్నిస్తుంటేనే ఫలితాలు వస్తాయని అన్నారు. విశాఖలో గూగుల్ ఏర్పాటుకు ఎంవోయూ కుదిరిందని, మంత్రి లోకేష్ కృషితో గూగుల్ ఏర్పాటుకు మార్గం సుగమం అయిందని చంద్రబాబు అన్నారు. గూగుల్ ఎంవోయూతో విశాఖలో అధిక అభివృద్ధి జరుగుతుందని సీఎం చంద్రబాబు

..మిగతా 2లో



## ఆశల పల్లకిలో
# కేటీఆర్
### అధికారం వస్తుందని పగటి కలలు కంటున్నారు
### కేటీఆర్ వ్యాఖ్యలపై మంత్రి శ్రీధర్ బాబు విమర్శలు

హైదరాబాద్ డిసెంబర్ 11(నిఘా న్యూస్) ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యేల శిక్షణా తరగతులకు వెళ్లవద్దని కేటీఆర్ తన పార్టీ ఎమ్మెల్యేలకు పిలుపునిచ్చారని, దీంతో బీఆర్ఎస్ మానసిక స్థితి ఏమిటో తెలుస్తోందని మంత్రి శ్రీధర్ బాబు విమర్శించారు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలకు ప్రభుత్వం శిక్షణా తరగతులను నిర్వహిస్తోంది. ఈ క్రమంలో శ్రీధర్ బాబు ఓ టీవీ ఛానల్‌తో మాట్లాడుతూ ప్రతిపక్షం ప్రతి దానిని రాజకీయం చేయాలని చూస్తోందన్నారు. కేటీఆర్ ఆశల పల్లకిలో ఉన్నారని,

..మిగతా 2లో

## దాడిని నిరసిస్తూ
# జర్నలిస్టుల ఆందోళన
2

### మోహన్ బాబు బేషరుతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్

## యూపీఎస్సీ మెయిన్స్‌లో...
# 20 మంది తెలంగాణ వాసుల ఉత్తీర్ణత



హైదరాబాద్ డిసెంబర్ 11(నిఘా న్యూస్) యూపీఎస్సీ సివిల్స్ మెయిన్స్-2024 పరీక్ష ఫలితాల్లో తెలంగాణ అభ్యర్థులు సత్తా చాటారు. ఈ ఏడాది మొదటి సారిగా రాష్ట్రం నుంచి సివిల్స్ మెయిన్స్ పరీక్షలకు హాజరైన అభ్యర్థులకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించింది. సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్న పేద కుటుంబీకులకు అండగా నిలిచేందుకు రాజీవ్ సివిల్స్ అభయ హస్తం పథకాన్ని తెలంగాణ ప్రభుత్వం అమలు చేసింది. సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో 135 మందికి రూ. లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించింది. ఈ ఏడాది ఆగస్ట్ 26న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సివిల్స్ అభ్యర్థులకు చెక్కులు పంపిణీ చేశారు. రాజీవ్ సివిల్స్ అభయ హస్తం సాయం

..మిగతా 2లో

## సిరియా నుండి
# క్షేమంగా చేరుకున్న భారతీయులు



న్యూఢిల్లీ డిసెంబర్ 11 (నిఘా న్యూస్) సిరియాలో నెలకొన్న అంతర్యుద్ధంలో చిక్కుకు పోయిన భారతీయులను వెనక్కి తీసుకొచ్చేందుకు భారత ప్రభుత్వం నడుం బిగించింది. సుమారు 75 మందిని సిరియాలోని కల్లోల ప్రాంతం నుంచి సురక్షితంగా బయటకు తీసుకొచ్చింది. వారిలో 44 మంది జైరీన్ (ఇస్లామిక్ ఆధ్యాత్మిక యాత్రికులు) ఉన్నారని భారత విదేశాంగ శాఖ ప్రకటించింది. ప్రపంచంలో ఏ మూలకు వెళ్లినా ఇప్పుడు భారతీయులు కనిపిస్తున్నారు. ప్రపంచంలో ఎక్కడ ఏ సంక్షోభం తలెత్తినా, అక్కడ చిక్కుకున్న భారతీయులను సురక్షితంగా స్వదేశానికి చేర్చేందుకు భారత ప్రభుత్వం

..మిగతా 2లో

# ముత్యాలమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠ
### విగ్రహాన్ని కూల్చిన నిందితులపై చర్యలేవి: ఈటల
### కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు కొండా సురేఖ, పొన్నం

హైదరాబాద్ డిసెంబర్ 11(నిఘా న్యూస్) సికింద్రాబాద్ కుమ్మరి గూడలోని శ్రీముత్యాలమ్మ గుడిలో అమ్మవారి పునఃప్రతిష్ఠ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేష్, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు, దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ హాజరై ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గతంలో సికింద్రాబాద్ ఆలయంలో జరిగిన సంఘటన దురదృష్టకరమని వెంటనే ప్రభుత్వం స్పందించి స్థానిక శాసన సభ్యుడి విజ్ఞప్తి మేరకు దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో విగ్రహ పునః ప్రతిష్ఠ చేయడం జరిగిందన్నారు. అమ్మవారి ఆశీస్సులు అందజేసే విధంగా వేద పండితులతో పునఃప్రతిష్ఠ చేసుకొని దేవదాయ శాఖ మంత్రి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు

..మిగతా 2లో



## వైసీపీ రద్దు చేసిన
# పథకాల పునరుద్ధరణ
### ఏపీలో రేషన్ కార్డుదారులకు ప్రభుత్వం తీపి కబురు

అమరావతి, డిసెంబర్ 11(నిఘా న్యూస్) రాష్ట్రంలో ఎస్సీ సంక్షేమ పథకాలన్నీ అర్హులైన వారికి అందిస్తామని, గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన ఎస్సీ సంక్షేమ పథకాలన్నింటినీ తిరిగి పునరుద్ధరిస్తామని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. గత ప్రభుత్వం కమిటీ హాల్స్ ను పూర్తి చేయకుండా నిర్లక్ష్యం వహించారని, రాష్ట్ర వ్యాప్తంగా అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ హాల్స్ ను త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. త్వరలోనే రాష్ట్రంలోని క్రిస్టియన్స్ అందరికీ క్రిస్మస్ కానుక అందిస్తామన్నారు. అంబేద్కర్ విదేశీ విద్యా దీవెన పథకాన్ని కూడా పునరుద్ధరిస్తామన్నారు. రాష్ట్రంలో రూ. 340 కోట్లతో నూతన ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలను నిర్మిస్తామన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా డిసెంబర్, జనవరి

..మిగతా 2లో





## 2035 నాటికి భారత్‌కు
# సొంత స్పేస్ స్టేషన్
### కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్

డిసెంబర్ 11(నిఘా న్యూస్) 2035 నాటికి భారత్‌కు సొంత స్పేస్ స్టేషన్ ఉంటుందని కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ వెల్లడిరచారు. సొంతంగా అంతరిక్ష కేంద్రాన్ని నిర్మించుకోబోతున్నామన్నారు. అలాగే, 2040 నాటికి చంద్రుడిపై భారతీయుడు కాలుమోపుతారన్నారు. ఫిబ్రవరి 27న తిరువనంతపురంలో గగన్‌యాన్ మిషన్‌ను సంబంధించిన వ్యోమగాముల పేర్లను ప్రకటించిన అనంతరం, ప్రధాని నరేంద్ర మోదీ 2035 నాటికి భారత్‌కు సొంత స్పేస్ స్టేషన్ ఉంటుందని చెప్పారు. ఇప్పుడు ఈ కల త్వరలోనే నెరవేరబోతున్నది. ప్రస్తుతం దేశాలకు స్పేస్‌స్టేషన్స్ ఉన్నాయి. భారత్ సొంతంగా అంతరిక్ష కేంద్రాన్ని నిర్మిస్తే.. చారిత్రాత్మక విజయంతో పాటు సొంత స్పేస్‌స్టేషన్ ఉన్న మూడోదేశంగా నిలువనున్నది. భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ భారత్ స్పేస్ స్టేషన్ కోసం ప్రణాళికలు రూపొందించింది. 52 టన్నుల బీఏఎస్ తొలుత ముగ్గురు వ్యోమగాములు వెళ్లొచ్చు. భవిష్యత్‌లో దాని సామర్థ్యాన్ని ఆరుకి పెంచే యోచనలో ఉన్నది. బెంగళూరులోని యూఆర్‌రావు శాటిల్కైట్ సెంటర్‌లో జరిగిన కన్నడ సాంకేతిక సదస్సులో ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడయ్యాయి. బీఏఎస్ అనేది లైఫ్ సైన్సెస్, మెడిసిన్ రంగాల్లో శాస్త్రీయ పరిశోధనలకు మద్దతు ఇచ్చేందుకు, అంతరిక్ష పరిశోధనలను మెరుగుపరిచేందుకు భారత్ అభివృద్ధి చేస్తున్న మాడ్యులర్ స్పేస్ స్టేషన్. తొలి మాడ్యుల్ 2028లో ఎల్‌వీఎం3 వాహకనౌక ద్వారా ప్రారంభించనున్నట్లు

..మిగతా 2లో

## వరకట్న వేధింపుల కేసుల్లో
# జాగ్రత్తలు పాటించాలి



### కోర్టులకు సూచించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ డిసెంబర్ 11 (నిఘా న్యూస్) వరకట్న వేధింపుల కేసుల్లో కోర్టులు అప్రమత్తంగా ఉండాలని సర్వోన్నత న్యాయస్థానం సూచించింది. చట్టాన్ని దుర్వినియోగం చేయకుండా చూడాలని చెప్పింది. భర్త తరపు

..మిగతా 2లో

# పార్లమెంట్‌లో వినూత్న నిరసనలు

న్యూఢిల్లీ డిసెంబర్ 11 (నిఘా న్యూస్) అమెరికా బిలియనీర్ జార్జ్ సోరోస్‌తో కాంగ్రెస్‌కు సంబంధాలు, అదానీ అవినీతి అంశాలు పార్లమెంట్‌ను కుదిపేస్తున్నాయి. సోరోస్ అంశంపై కాంగ్రెస్‌ను అధికార పార్టీ ఎంపీలు ప్రశ్నిస్తుండగా అదానీ వ్యవహారంపై బీజేపీని విపక్ష కూటమి ఎంపీలు నిలదీస్తున్నారు. దీంతో సమావేశాలు అట్టుడుకుతున్నాయి. అదానీ అంశంపై కాంగ్రెస్ ఎంపీలు బుధవారం వినూత్న రీతిలో నిరసన తెలిపారు. పార్లమెంట్

..మిగతా 2లో



# సంక్షోభంలోనే అవకాశాలను సృష్టించాలి

**మొదటి పేజీ తరువాయి...**

ఆశాభావం వ్యక్తం చేశారు. హార్డ్ వర్క్ ముఖ్యం కాదని, స్మార్ట్ వర్క్ కావాలని ,ఓటే దేశాన్ని కాపాడుతుందని, ప్రజాస్వామ్యం లేకపోతే నియంతృత్వం వస్తుందని సీఎం చంద్రబాబు అన్నారు. విధ్వంసక పాలన తర్వాత ఏపీలో పునర్నిర్మాణం జరుగుతోందని, ప్రభుత్వ విజన్ , డైరెక్షన్ కలెక్టర్‌లకు తెలియజేయడం ఈసమావేశం ముఖ్య ఉద్దేశమని అన్నారు. నాశనం జరిగాక దాన్నితిరిగి నిర్మించినప్పుడు, హార్డ్ వర్కు అవసరం అవుతుందన్నారు. క్రైసిస్‌లోనే అవకాశాలు ఉంటాయని దాన్ని తాను నమ్ముతానని, ఎన్నికల కంటే ముందు తమకు ఓ అనుభవం ఉందని సీఎం అన్నారు. అయిదేళ్ళ తరువాత ఇండియాలో తప్పు చేసిన వారిని ఇంటికి పంపుతుందని, ఓటే ఈ దేశాన్ని కాపాడుతోందని, ప్రజాస్వామ్యంలో కరెప్షన్ జరిగినప్పుడు నియంతలు పుడతారన్నారు.



**వైజాగ్‌లో గూగుల్ ఏర్పాటు.**

ఐటి మంత్రి లోకేష్ అమెరికా వెళ్లి గూగుల్ వారిని సంప్రదించడతో వారు వైజాగ్ రావడానికి ఒప్పుకున్నారని, ఇప్పుడు వారితో ఒప్పందం చేసుకున్నామని చంద్రబాబు తెలిపారు. గూగుల్ తో చేసుకున్న ఒప్పందం విశాఖలో ఎంతో అభివృద్ధికి కారణం అవుతుందన్నారు. విశాఖ మంచి సిటీ అని గుర్తించామని గూగుల్ వాళ్లు చెపుతున్నారన్నారు. విశాఖకు గూగుల్ వాళ్లు వస్తున్నారంటే అది ఓ గేమ్ చేంజర్ అవుతుందన్నారు. విశాఖలో డేటా సెంటర్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, సీ కేబుల్ కనెక్టివిటీ వస్తే విశాఖ ఓ డీప్ టెక్ డెస్టినేషన్ అవుతుందన్నారు. ప్రజలు హార్డ్ వార్కు కాకుండా స్మార్ట్ వర్కు చేయాలని కొరుతున్నానని, ఆర్టీజీఎస్‌తో గూగుల్ ఓ ఒప్పందం చేశారని, ఆ ఒప్పందం ఎంతో మేలు చేస్తుందన్నారు. విశాఖ పట్నం ఏజెన్సీ ఏరియాలో గంజాయి ఎక్కడ ఉందనేది గ్రహించామని, గూగుల్ శాటిలైట్ ద్వారా గుర్తించి డ్రోన్లు పంపి నాశనం చేయగలుగుతామని, గూగుల్‌తో ఒప్పందం రాష్ట్రంలోని యువతకు గుడ్ న్యూస్ అని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

**ఒకటిన జీతాలు, పెన్షన్లు,**

గతంలో ఒకటో తారీఖున జీతాలు రాలేదని. ఇప్పుడు ఒకటో తారీఖునే జీతాలు, పెన్షన్‌లు ఇస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. గతంలో అనేక తప్పులు జరిగాయని, తనకు కోపం, కసి ఉందన్నారు. అయితే తొందరపడకుండా ముందుకు వెళ్ళాలని అన్నారు. రాష్ట్రం బ్రాండ్ అయిదేళ్ళలో దెబ్బతిన్నదని, నమ్మకం పోయిందని, ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ తీసుకువచ్చామని.. ఎవరయితే ల్యాండ్‌ను గ్రాబ్ చేసారో వారే దాన్ని ప్రూఫ్ చేసుకోవాలని చంద్రబాబు అన్నారు.

**ఇంకా వైఎస్సార్‌సీపీ వాసనలు పనిచేస్తున్నాయి.**

ఇంకా వైఎస్సార్‌సీపీ వాసనలు పనిచేస్తున్నాయని, కేంద్రం ఇచ్చిన డబ్బులు డైవర్ట్ చేసారని. వాటికి యూసి ఇచ్చి డబ్బులు తెస్తున్నామని సీఎం చంద్రబాబు చెప్పారు. ఏపీ రాజధానిగా అమరావతిని సెట్ చేశామని, కేంద్రం రూ. 15 వేల కోట్లు ఇచ్చిందని, బయటనుండి రూ. 16 వేల కోట్లు తెస్తున్నామని తెలిపారు. అమరావతికి రూ.31 వేల కోట్లు మొబల్కైజ్ చేశామని, ఫైనల్‌గా తోలిదశకు రూ.50 వేల కోట్లు కావాలన్నారు. పెన్షన్‌ను 3 నెలలు పాటు క్యారీ ఫార్వర్డ్ చేస్తున్నామని, దేశంలోనే ఎక్కువ పెన్షన్‌లు ఇచ్చే రాష్ట్రం ఏపీ మాత్రమేనని అన్నారు. రూ. 33 వేల కోట్ల పించన్లు ఇస్తున్నామని, దీపం 2 కింద 40 లక్షల మందికి సొమ్ములు చెల్లించామని సీఎం చంద్రబాబు తెలిపారు.

**బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట.**

అయిదేళ్లలో నాశనం అయిన రోడ్లు అన్ని పాత్ హెూల్ ఫ్రీగా చేస్తున్నామని, రాష్ట్రంలో రేషన్ బియ్యం మాఫియాకు అడ్డుకట్టపడాలని సీఎం చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో ఏ నేరం జరిగినా దాని వెనుక గంజాయి, డ్రగ్స్ బ్యాచ్‌లు ఉన్నట్టు వెలుగులోకి వస్తోందన్నారు. గంజాయి, డ్రగ్స్ మాఫియా కట్టడికి అంతా కలిసి పనిచేయాల్సిందేనని, జిల్లాల్లో ఈ మాఫియాను కూకటి వేళ్లతో పెకిలించేయాలని కలెక్టర్లను ఆదేశిస్తున్నానని అన్నారు. గతంలో భూముల్ని మాత్రమే కబ్జా చేసేవాళ్లు, ఇప్పుడు పోర్టులు, సెజ్‌లను కూడా కబ్జా చేసేస్తున్నారని ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి అక్రమాలను అడ్డుకునేందుకే ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ అందుకే తీసుకువచ్చామన్నారు. 2047 విజన్ సాధన కోసమే రాష్ట్రంలో 20కి పైగా పాలసీలను తీసుకువచ్చామని, రాష్ట్రస్థాయితో పాటు జిల్లా, నియోజకవర్గ స్థాయిలోనూ ఈ విజన్ ప్లాన్ అమలు కావాలిన్నారు. 20 లక్షల మందికి ఉద్యోగాలు ఇవ్వటమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. అమరావతిని 31 వేల కోట్ల రూపాయల మేర నిధులతో నిర్మాణం చేపట్టబోతున్నామని, 2027కు పోలవరం పూర్తి చేసేందుకు గడువు నిర్దేశించుకుని ప్రణాళిక అమలు చేస్తున్నామన్నారు. వచ్చే విద్యా సంవత్సరం లోపు 16 వేల పైచిలుకు టీచర్ పోస్టుల భర్తీ చేస్తున్నామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.



## ముత్యాలమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠ

**మొదటి పేజీ తరువాయి...**

ఆయన తెలిపారు. ఎక్కడైనా దేవాలయాలు, ప్రార్థన మందిరాల పట్ల రాజకీయం చేయడం మంచిది కాదని హితవు పలికారు. ఆ ముత్యాలమ్మ వారికి రెండు చేతులు జోడిరచి ప్రజలంతా సుఖ సంతోషాలతో ఆయు ఆరోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. దేవాలయాలను కాపాడుకోవాలి విద్రోహం జరిగినపుడు అందరం కలిసి ఎదుర్కోవాలి కానీ రాజకీయాలు తగదు అన్నారు. ప్రజల విశ్వాసం కాపాడేలా తమ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఈ సందర్భంగా తెలియజేశారు.అనంతరం ముత్యాలమ్మ ఆలయంలో మంత్రి కొండా సురేఖ కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కొండా సురేఖ మాట్లాడుతూ భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని అమ్మవారి ఆలయాన్ని ప్రభుత్వ ఖర్చుతో నిర్మించడంతో పాటు, పంచలోక విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అమ్మవారి విగ్రహ ప్రతిష్ట చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. కొంతమంది రాజకీయ లబ్ధికోసం మత విద్వేషాలను రెచ్చగొట్టడం మానుకోవాలని హెచ్చరించారు. శ్రీ ముత్యాలమ్మ తల్లిని బీజేపీ ఎంపీ ఈటల దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మానికి వ్యతిరేకంగా ఆలయంపై దాడి చేసిన వారిని ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు.

## వైసీపీ రద్దు చేసిన పథకాల పునరుద్ధరణ

**మొదటి పేజీ తరువాయి...**

నెలలోనే రుణాలు అందిస్తామన్నారు. గత ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ ని మూడు ముక్కలు చేసి నిధులు అందివ్వకుండా నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. లిడ్ కాప్ కు నిధులు అందించి రుణాలు అందిస్తామన్నారు. విజయవాడ ఆటోనగర్ లో విలువైన భూములను అన్యాక్రాంతం చేశారని, అక్కడ పిపిపి మోడల్ లో వాటిని అభివృద్ధి చేస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా హాస్టల్స్ రిపేరుకు రూ.140 కోట్లు కేటాయించినట్టు తెలిపారు.ఐదు నెలల పాలనలో హాస్టల్ విద్యార్థులకు కార్పొరేట్ వైద్యం అందించి, వారి ఆరోగ్యానికి కాపాడే చర్యలు తీసుకున్నట్టు వివరించారు. అమరావతిలో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహానికి స్థలం కేటాయిస్తే గత ప్రభుత్వం స్థలాన్ని మార్చి విజయవాడ స్వరాజ్ మైదానంలో ఆ విగ్రహం పెట్టారన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రాజెక్టుకు సంబంధించి అసంపూర్తిగా ఉన్న హాల్స్, తదితర పనులను పూర్తి చేస్తామన్నారు. విజయవాడ నగరంలో ఉన్న హాస్టల్స్ రిపేర్ కి రూ. 42 లక్షల నిధులు కేటాయించామన్నారు.గత ప్రభుత్వం విద్యార్థులకు చెల్లించాల్సిన హాస్టల్ బకాయిలను కూడా చెల్లించకుండా విద్యార్థులను పట్టించుకోలేదని, విద్యార్థులను ఇబ్బంది పెట్టకుండా డిసెంబర్ నెలలోనే బకాయిలు చెల్లిస్తామన్నారు. నాణ్యతతో కూడిన యూనిఫామ్స్, బ్యాగులను పాఠశాలలు ప్రారంభానికి ముందే విద్యార్థులకు అందిస్తామన్నారు.. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడం తోపాటు శానిటేషన్ కి అధిక ప్రాధాన్యం ఇస్తామన్నారు.. రాబోయే కాలంలో సాంఘిక సంక్షేమ శాఖ లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొస్తామన్నారు.

## వరకట్న వేధింపుల కేసుల్లో జాగ్రత్తలు పాటించాలి

**మొదటి పేజీ తరువాయి...**

వారిని ఇరికించే ధోరణులు కనిపిస్తున్న నేపథ్యంలో చట్టాన్ని దుర్వినియోగం చేయకుండా అమాయక కుటుంబ సభ్యులు అనవసర ఇబ్బందులు పడకుండా జాగ్రత్తపడాలని చెప్పింది. ఫ్యామిలీ వివాదాల కారణంగా తలెత్తే క్రిమినల్ కేసుల్లో నిర్దిష్ట ఆరోపణలు లేకుండా కుటుంబ సభ్యుల పేర్లను ప్రస్తావించడాన్ని ప్రారంభంలోనే అడ్డుకోవాలని జస్టిస్ బీవీ నాగరత్న, ఎన్ కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. భార్యాభర్తల మధ్య విభేదాల కారణంగా గృహ సంబంధిత వివాదాలు తలెత్తిన సమయంలో భర్త కుటుంబ సభ్యులందరినీ ఇరికించే ప్రయత్నం తరచుగా జరుగుతుందనేది అందరికీ తెలిసిన విషయమేనని.. న్యాయపరంగా ఇది రుజువైందని ధర్మాసనం పేర్కొంది. ఇలాంటి పరిస్థితిలో చట్టాన్ని దుర్వినియోగం చేయడం ద్వారా అమాయకులు ఎవరూ చిక్కుకోకుండా కోర్టులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పింది. భర్తతో పాటు ఆయన అతడి తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులపై భార్య దాఖలు చేసిన ఓ వరకట్న వేధింపుల కేసును కొట్టివేసేందుకు తెలంగాణ హైకోర్టు నిరాకరించింది. అయితే, ఆ ఆదేశాలను సుప్రీంకోర్టు కొట్టివేసింది.

## యూపీఎస్సీ మెయిన్స్‌లో... 20 మంది తెలంగాణ వాసుల ఉత్తీర్ణత

**మొదటి పేజీ తరువాయి...**

అందుకున్న అభ్యర్థుల్లో 20 మంది యూపీఎస్సీ సివిల్స్ మెయిన్స్ ఫలితాల్లో విజేతలుగా నిలిచారు. వరంగల్ అర్బన్ జిల్లాకు చెందిన ఈ. సాయి శివాని, రాహుల్ శంకేషి, పోతరాజు హరి ప్రసాద్, విక్రమ్ బేతి, ఖమ్మం జిల్లాకు చెందిన నల్లమల సాయికుమార్ , బానోతు నాగ రాజా నాయక్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాకు చెందిన కదారి శ్రీవాణి, గాదె శ్వేత, రాపర్తి ప్రీతి, మెదక్ జిల్లాకు చెందిన కుమ్మరి శ్రవణ్ కుమార్, రంగారెడ్డి జిల్లాకు చెందిన మొహమ్మద్ అశ్ఫాక్, తొగరు సూర్యతేజ, మహబూబాబాద్ జిల్లాకు చెందిన బెస్త ప్రియాంజలి, సిద్దిపేటకు చెందిన నరిగె స్వామి, నాగర్‌కర్నూలుకు చెందిన గోకమల్ల ఆంజనేయులు, ఆదిలాబాద్‌కు చెందిన ఆర్. ప్రమోద్ కుమార్, వికారాబాద్‌కు చెందిన బి. ప్రహ్లాద్, జగిత్యాలకు చెందిన బురుగుపెల్లి నీరజ్ కుమార్, భద్రాద్రి కొత్తగూడెంకు చెందిన జస్వంత్ కుమార్, ఆసిఫాబాద్-కుమ్రంభీం జిల్లాకు చెందిన రామ్టెంకి సుధాకర్ సివిల్స్ మెయిన్స్ క్వాలిఫై అయిన జాబితాలో ఉన్నారు. తెలంగాణ నుంచి మెయిన్స్ ఫలితాల్లో విజయం సాధించి ఇంటర్వ్యూకు ఎంపికైన అభ్యర్థులందరికీ సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం కింద ప్రభుత్వం లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందజేసిన వారిలో 20 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూకు ఎంపిక కావడం పట్ల సీఎం అభినందనలు తెలిపారు. తెలంగాణ నుంచి ఎక్కువ మంది సివిల్స్ సాధించేలా తదుపరి దశల్లోనూ అభ్యర్థులు రాణించాలని సీఎం ఆకాంక్షించారు. మెయిన్స్‌లో ఉత్తీర్ణులై ఇంటర్వ్యూకు అర్హత సాధించిన వారికి మరో రూ.లక్ష అందిస్తామని సీఎం గతంలో హామీ ఇచ్చారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) సివిల్ సర్వీసెస్ మెయిన్స్ ఎగ్జామ్ 2024 ఫలితాలను మంగళవారం విడుదల చేసింది. అభ్యర్థులు తమ ఫలితాలను అధికారిక వెబ్‌సైట్ లో చూసుకోవచ్చు. మెయిన్ సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఇప్పుడు ఇంటర్వ్యూ రౌండ్ కు హాజరు కావాల్సి ఉంటుంది. ఇంటర్వ్యూ షెడ్యూల్ ను త్వరలోనే వెబ్‌సైట్‌లో విడుదల చేయనున్నారు. అభ్యర్థులు యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రధాన కార్యాలయం, ధోల్పూర్ హౌస్, షాజహాన్ రోడ్, న్యూఢిల్లీ-110069లో ఇంటర్వ్యూకు హాజరు కావాల్సి ఉంటుంది.

## దాడిని నిరసిస్తూ జర్నలిస్టుల ఆందోళన

### మోహన్ బాబు బేషరుతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్

హైదరాబాద్, డిసెంబర్11(నిఘా న్యూస్): మంచు మోహన్ బాబు ఇంటి వద్ద తీవ్ర ఉద్రిక్తతల నేపథ్యంలో పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. ఇప్పటికే ఆయన ఇంటి వద్ద భారీగా పోలీసులను మోహరించారు. మరోవైపు మోహన్ బాబు, మనోజ్, విష్ణు లైసెన్స్ తుపాకులను స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఈరోజు ఉదయం 10.30గంటలకు విచారణకు హజరు కావాలని ఆదేశించారు. ఈ క్రమంలోనే మంచు ఫ్యామిలీలోని గొడవను కవరేజ్ చేయడానికి వెళ్లిన మీడియాపై మోహన్ బాబు దాడి చేయడం తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనలో టీవీ9 ప్రతినిధి రంజిత్ తీవ్రంగా గాయపడ్డారు. అతడి కంటికి, చెవికి మధ్య మూడు చోట్ల జైగోమాటిక్ ఎముక విరిగినట్లు వైద్యులు తెలిపారు. టీవీ9 మీడియా ప్రతినిధి రంజిత్ పై దాడి చేసిన అనంతరం అక్కడి నుంచి మోహన్ బాబు, విష్ణు వెళ్లిపోయారు. ప్రస్తుతం మంచు మనోజ్ జల్ పల్లిలోని మోహన్ బాబు ఇంటిలోనే ఉన్నారు. మోహన్ బాబు ఇంటి వద్ద తీవ్ర ఉద్రిక్తతల నేపథ్యంలో పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. ఈ క్రమంలోనే మోహన్ బాబు, మంచు విష్ణు, మంచు మనోజ్ కు పోలీసులు నోటీసులు జారీ చేశారు.మీడియాపై మోహన్ బాబు దాడి చేసిన ఘటనపై పోలీస్ శాఖ సీరియస్ అయ్యింది. ఈ క్రమంలోనే మోహన్‌బాబు బౌన్సర్లను బైండోవర్ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. అలాగే మోహన్‌బాబు, విష్ణు గన్‌లను స్వాధీనం చేసుకున్నారు పోలీసులు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఫిల్మ్ నగర్ పోలీసులు మంచు మోహన్ బాబు, విష్ణు నుంచి తుపాకులను స్వాధీనం చేసుకున్నారు. అలాగే బుధవారం ఉదయం 10:30 గంటలకు విచారణకు హాజరుకావాలని రాచకొండ పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఇప్పటికే మోహన్ బాబు నివాసం వద్ద పోలీసులు భారీగా మోహరించారు. జర్నలిస్టుపై దాడికి దిగడంతో మోహన్ బాబుకు వ్యతిరేకంగా పలువురు జర్నలిస్టులు ఆందోళన చేపట్టారు. మీడియాపై దాడికి నిరసనగా ఆయన ఇంటి వద్ద బైఠాయించి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మరోవైపు మోహన్ బాబు ఆసుపత్రిలో చేరారు. గచ్చిబౌలిలోని కాంటినెంటర్ ఆసుపత్రిలో ప్రస్తుతం ఆయనకు చికిత్స అందిస్తున్నట్లు సమాచారం. ఆయన వెంట పెద్ద కుమారుడు విష్ణు ఉన్నారు. టీవీ9 జర్నలిస్ట్ రంజిత్‌పై సినీ నటుడు మోహన్‌బాబు దాడిని ఖండిస్తూ హైదరాబాద్ ఫిల్మ్ చాంబర్ దగ్గర జర్నలిస్ట్ సంఘాలు ఆందోళనకు దిగాయి. సీనియర్ జర్నలిస్టులు, జర్నలిస్ట్ సంఘాల నాయకులంతా ఫిల్మ్ చాంబర్ దగ్గర బైఠాయించి నిరసన తెలిపారు. హైదరాబాద్‌లోని ఫిల్మ్ ఛాంబర్ ముందు నిరసన తెలిపారు జర్నలిస్టులు. టీవీ9 జర్నలిస్ట్ రంజిత్‌పై దాడిని ఖండిస్తూ ఆందోళన నిర్వహించారు. నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు టీవీ9 ఉద్యోగులు. ఈ నిరసనలో పాల్గొన్న టీవీ9 మేనేజింగ్ ఎడిటర్ రజినీకాంత్ మోహన్ బాబు ప్రవర్తనపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. 70 ఏళ్లు పైబడిన వ్యక్తి.. ఇంత జీవితం చూసిన వ్యక్తి నుంచి ఈ ప్రవర్తన ఊహించలేదన్నారు. గతంలో కూడా మంచు ఫ్యామిలీ ఇలా ప్రవర్తించిన దాఖలాలు ఉన్నాయని.. అప్పటిలానే ఇప్పుడు కూడా పశ్చాత్తాపం కనిపించడం లేదన్నారు రజినీకాంత్. మీడియా కెమెరాలు, మైకులు. ప్రజలు గొంతకను చూపించే, వినిపించే సాధనాలు అని వాటినే వినియోగించి జర్నలిస్టులపై దాడి చేయడం దారుణమన్నారు. గాయపడిన టీవీ9 కుటుంబ సభ్యుడు రంజిత్‌కు సర్జరీ జరుగుతుందని అతనికి నెల రోజులు పాటు తిండి తినే ఆస్కారం కూడా లేదన్నారు. పైప్ వేసి ఆహారం అందించాల్సి ఉంటుందన్నారు. రంజిత్‌కు టీవీ9 కుటుంబం మొత్తం అండగా ఉంటుందన్నారు. దాడి సమయంలో మోహన్ బాబు ప్రవర్తనను చూస్తే.. కక్ష పెట్టుకుని కసితీరా కొట్టినట్లుందన్నారు. ఈ ఘటనపై ప్రభుత్వం తక్షణమే స్పందించి సీరియస్ యాక్షన్ తీసుకోవాలని డిమాండ్ చేశారు. మోహన్‌బాబుపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలన్నారు. ఎడిటర్ రజినీకాంత్. ప్రజా ప్రభుత్వంలో జర్నలిస్టులకు రక్షణ కల్పించేలా చట్టం తీసుకురావాలని కోరారు. కాగా మోహన్ బాబు హెల్త్ అప్డేట్ విడుదల చేసిన తర్వాత మంచు విష్ణు తాజాగా ప్రెస్ మీట్ పెట్టారు. ఈ క్రమంలోనే మీడియాపై దాడి ఘటనను ఇంకా సెన్సేషన్ చెయ్యొద్దని క్షణికావేశంలో మాత్రమే ఆ ఘటన జరిగిందని అన్నారు. మీడియాతో విష్ణు మాట్లాడుతూ "మాది ఉమ్మడి కుటుంబం. మేము కలిసిమెలిసి ఉంటామని అనుకున్నాను, కానీ దురదృష్టవశాత్తు ఇలా జరిగింది. మేము మళ్లీ తిరిగి కలుస్తామని ఆశిస్తున్నాను. మా నాన్న చేసిన తప్పు మమ్మల్ని అతిగా విపరీతంగా ప్రేమించడం. ప్రతీ కుటుంబంలోనూ ఇలాంటి గొడవలు ఉంటాయి. కాబట్టి, ఈ విషయాన్ని సెన్సేషన్ చేయ్యొద్దు. ప్రజలలో మాకు గుర్తింపు ఉంది. ప్రజల్లోకి తీసుకెళ్లడం కరెక్టే కానీ కొంతమంది హద్దులు మీరి వ్యవహరిస్తున్నారు. మీడియాపై దాడి అనేది కేవలం క్షణికావేశంలో జరిగింది. మా నాన్న ఉద్దేశపూర్వకంగా దాడి చేయలేదు. ఈ జరిగిన ఘర్షణలో నాన్నకు గాయాలయ్యాయి. కన్నప్ప సినిమా కోసం పోస్ట్ ప్రొడక్షన్ కోసం లాస్ ఏంజెల్స్ లో ఉన్నప్పుడు ఇంట్లో జరుగుతున్నాయని నాకు ఫోన్ వచ్చింది. అన్నీ అక్కడే వదిలేసి వచ్చేశాను. నిన్న ఉదయాన్నే వచ్చాను. ఏం జరుగుతుందో అర్థంకాలేదు. వినయ్ నాకు ఒక అన్న లాంటి వాడు. పోలీసులు మాకు నోటీసులు ముందు ఇవ్వక ముందు ప్రెస్ కు రిలీజ్ చేస్తున్నారు. కమిషనర్ ముందు హాజరవుతాను. నిన్న జరిగిన గొడవలో ఓ రిపోర్టర్ కు గాయాలయ్యాయి. అది దురదృష్టకరం. ఆయన ముందు నమస్కారం పెడుతూ ముందుకు వచ్చారు. కానీ ఆ హీట్ మూమెంట్ లో అలా జరిగింది. ఉద్దేశపూర్వకంగా మేము చేయలేదు అని అంటూ తన తండ్రి తప్పేం లేదన్నట్లుగా మాట్లాడారు. మంచు విష్ణు మాటలపై జర్నలిస్టు సంఘాలు మండిపడుతున్నాయి.

## సిరియా నుండి క్షేమంగా చేరుకున్న భారతీయులు

**మొదటి పేజీ తరువాయి...**

'ఆపరేషన్లు' చేపడుతోంది. రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధం ప్రారంబమైనప్పుడు ఉక్రెయిన్‌లో చిక్కుకుపోయిన భారతీయ వైద్య విద్యార్థులు, ఇతరులను సురక్షితంగా వెనక్కి తీసుకొచ్చేందుకు 'ఆపరేషన్ గంగా' చేపట్టిన విషయం అందరికీ గుర్తుండే ఉంటుంది. ఇప్పుడు తాజాగా సిరియాలో నెలకొన్న అంతర్యుద్ధంలో చిక్కుకుపోయిన భారతీయులను వెనక్కి తీసుకొచ్చేందుకు భారత ప్రభుత్వం నడుం బిగించింది. సుమారు 75 మందిని సిరియాలోని కల్లోల ప్రాంతం నుంచి సురక్షితంగా బయటకు తీసుకొచ్చింది. వారిలో 44 మంది జైరీన్ (ఇస్లామిక్ ఆధ్యాత్మిక యాత్రికులు) ఉన్నారని భారత విదేశాంగ శాఖ ప్రకటించింది. జమ్ము-కాశ్మీర్‌కు చెందిన ఈ 44 మంది సిరియాలోని ఇస్లాంలో షియా వర్గానికి చెందిన పవిత్ర స్థలాల్లో ఒకటైన 'సైదా జైనాబ్' వద్ద వీరంతా చిక్కుకున్నారు. సరిగ్గా అదే సమయంలో సిరియా రాజధానిని తిరుగుబాటు దళాలు హస్తగతం చేసుకోవడం, 24 ఏళ్ల పాటు అధ్యక్షుడిగా పనిచేసిన నియంత మహమ్మద్ అల్ బషీర్ దేశం విడిచి రష్యాకు పారిపోవడం జరిగాయి. పూర్తి అల్లకల్లోలంగా ఉన్న ఆ దేశం నుంచి తమను స్వదేశానికి పంపాలని అభ్యర్థించారు. వారితో పాటు వేర్వేరు కారణాలతో సిరియాలో ఉంటున్న భారతీయులు కూడా స్వదేశానికి తిరిగొచ్చే ప్రయత్నాల్లో భాగంగా అక్కడున్న భారత దౌత్య కార్యాలయాన్ని సంప్రదించారు. దీంతో వారిని సిరియా రాజధాని డెమాస్కస్ నుంచి పొరుగుదేశం లెబనాన్ రాజధాని బీరుట్‌కు తరలించారు. బీరుట్ నుంచి భారత్‌లోని వివిధ నగరాలకు కమర్షియల్ ఎయిర్‌లైన్స్ సేవలు కొనసాగుతున్నాయి. వాటిలో తమ తమ స్వస్థలాలకు చేరుకునేలా దౌత్యాధికారులు సహకరించారు. అసలే దశాబ్దాలుగా సిరియా అంతర్గతంగా తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ప్రపంచంలోనే అత్యంత కిరాతక ఉగ్రవాద సంస్థగా పేరుమోసిన "ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాఖ్ అండ్ సిరియా పురుడు పోసుకున్నది కూడా ఈ దేశంలోనే. ఓవైపు నియంత అల్ బషీర్ పాలన, మరోవైపు "హయత్ తహ్రీర్ అల్-షాం" తిరుగుబాటుదారులు, ఇంకోవైపు ఉగ్రవాదులు, ఇలా అన్ని రకాలుగా తీవ్రమైన హింస, నిర్బంధాన్ని ఎదుర్కొంటున్న ఆ దేశం నుంచి మిలియన్ల సంఖ్యలో శరణార్థులుగా యూరప్ సహా ప్రపంచంలోని వివిధ దేశాలకు వలసపోయారు. ప్రస్తుతం నియంత పాలన పోయి గతంలో తిరుగుబాటుదారుల పాలన రావడం పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టుగా మారిందని అంతర్జాతీయ వ్యవహారాల విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే పొరుగుదేశం తిరుగు బాటు దారుల చేతిలోకి వెళ్లడంతో గత ప్రభుత్వం దాచిపెట్టిన క్షిపణులు, ఇతర మారణాయుధాలను తమ దేశానికి వ్యతిరేకంగా ప్రయోగిస్తారన్న భయంతో ఇజ్రాయిల్ ఇప్పుడు సిరియాపై విరుచుకుపడిరది. సైనిక స్థావరాలు, ఆయుధ భాండాగారాలను లక్ష్యంగా చేసుకుని మిస్సైల్ దాడులు, ఎయిర్‌స్ట్రైక్స్ నిర్వహిస్తోంది. ఇలాంటి అత్యంత తీవ్ర సంక్షోభ పరిస్థితుల్లోనూ అక్కడ భారతీయులు కొందరు సంచరిస్తూ ఇరుక్కుపోయారు. వారిలో కొందరు ఇప్పటికే దౌత్య కార్యాలయాన్ని సంప్రదించడంతో దేశం దాటి బయటపడేందుకు సహాయం లభించింది. ఇంకా సహాయం అందుకోవాల్సిన వారు ఉన్నారని భారత ప్రభుత్వం భావిస్తోంది. వారి కోసం సిరియా రాజధాని డెమాస్కస్‌లో ఉన్న భారత రాయబార కార్యాలయంలో ఒక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసింది.

## 2035 నాటికి భారత్‌కు సొంత స్పేస్ స్టేషన్


**మొదటి పేజీ తరువాయి...**

భావిస్తున్నారు. నాలుగు సంవత్సరాల తర్వాత స్పేస్‌స్టేషన్ రూపుదిద్దుకుంటుంది. స్పేస్‌స్టేషన్ మూడ్యుల్స్‌ని పలు దశల్లో నింగిలోకి పంపి.. ఆ తర్వాత అంతరిక్షంలోనే వాటిని అనుసంధానిస్తారు. 2035 నాటికి స్పేస్‌స్టేషన్ పూర్తవుతుంది. ప్రస్తుతం విశ్వంలో ఒకే స్పేస్‌స్టేషన్ ఉన్నది. దీన్ని నానా అనేక దేశాల సహకారంతో నిర్మించింది. ప్రస్తుతం చైనా సైతం సొంతంగా ఇంటర్‌నేషనల్ స్పేస్‌స్టేషన్‌ను నిర్మిస్తున్నది. భారత్ సైతం బీఎస్‌ఏని నిర్మిస్తే మూడోదేశంగా నిలువనున్నది. ఈ స్టేషన్‌కు భారత అంతరిక్ష కేంద్రంగా నామకరణం చేశారు. ఇది భవిష్యత్తులో అంతరిక్ష యాత్రల కోసం మైక్రోగ్రావిటీ, మానవ ఆరోగ్యం, లైఫ్ సస్టెయినింగ్ టెక్నాలజీస్‌పై అధ్యయనానికి అనుమతి ఇస్తుంది. అమెరికా, చైనా దేశాలు ఇప్పటికే తమ వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపుతున్నాయి. తాజాగా ఆ జాబితాలో భారత్ పేరు సైతం చేరనున్నది. ఈ ప్రాజెక్ట్ లక్ష్యం యువ శాస్త్రవేత్తలను ప్రేరేపించడంతో పాటు అంతరిక్షరంగంలో కొత్త వ్యాపార అవకాశాలను సృష్టించడం. చంద్రయాన్-1తో చంద్రుడిపై తొలిసారిగా నీటిజాడలను గుర్తించింది. ఆ తర్వాత చంద్రయాన్-3తో దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టిన తొలిదేశంగా ఇస్రో నిలిచింది. భారత్ స్పేస్ స్టేషన్ సైతం గర్వకారణంగా నిలువనున్నది. అదే సమయంలో అంతరిక్ష పరిశోధనల్లో భారత దేశ స్థానాన్ని సుస్థిరం చేయనున్నది.

## అమెరికాతో అదానీ పోర్ట్స్... రుణ ఒప్పందం ఉపసంహరణ

**మొదటి పేజీ తరువాయి...**

లిమిటెడ్ ఉపసంహరించుకుంది. శ్రీలంక రాజధాని కొలంబోలో ఓడ రేవు అభివృద్ధికి గాను ఈ రుణం ఒప్పందం కుదుర్చుకుంది. అయితే, ఇప్పుడీ ఒప్పందం నుంచి వెనక్కి తగ్గినట్టు సోమవారం రాత్రి ఏపీఎస్ఈజడ్ ఫైలింగ్‌ను బట్టి తెలిసింది. రుణ ఒప్పందం నుంచి వెనక్కి తగ్గిన నేపథ్యంలో కంపెనీ తన ఆదాయం, ఇతర మూలాల నుంచి వచ్చిన డబ్బు, మూలధనం నుంచి ఖర్చు చేయాలని నిర్ణయించినట్టు తెలిసింది. కాగా, అదానీపై ఇటీవల అమెరికాలో తీవ్ర అభియోగాలు నమోదయ్యాయి. సోలార్ ప్రాజెక్టుల కోసం భారత్‌లో ప్రభుత్వ అధికారులకు ముడుపులు ఇచ్చేందుకు అమెరికాలోని పెట్టుబడిదారుల నుంచి 265 మిలియన్ డాలర్లు సేకరించినట్టు కేసు నమోదైంది. అయితే, అమెరికా ఆరోపణలను అదానీ గ్రూప్ కొట్టిపడేసింది. అదానీ ప్రస్తుతం ఆసియా కుబేరుల్లో రెండోస్థానంలో ఉన్నారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ తొలి స్థానంలో కొనసాగుతున్నారు.



## పార్లమెంట్‌లో వినూత్న నిరసనలు

**మొదటి పేజీ తరువాయి...**

ఆవరణలో గులాబీలు, జాతీయ జెండాలను అందించారు. లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సహా ఇండియా కూటమి ఎంపీలంతా పార్లమెంట్ ఆవరణలో నిల్చొని.. సమావేశాలకు హాజరైన బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులకు వీటిని అందించారు. అదే సమయంలో వచ్చిన కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు కూడా రాహుల్ గులాబీని, జాతీయజెండాను ఇచ్చారు. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది.

## పదేళ్లలో 50 ఎయిర్ పోర్టులు

**మొదటి పేజీ తరువాయి...**

వాడుతున్నాం. తాజాగా ఏఐ డిజిటల్ ప్లాట్‌ఫామ్ ప్రారంభించాను. దేశ వ్యాప్తంగా 24 విమానాశ్రయాల్లో డిజియాత్ర టెక్నాలజీ వినియోగిస్తున్నాం. ఎయిర్‌పోర్టులు అంటే కేవలం రవాణా సౌకర్యం కాదు. అది ఎందరికో ఉపాధి సైతం కల్పిస్తున్నాయి. ఎయిర్‌పోర్టుల్లో డేటా అనలటిక్స్ వినియోగించి మరింత మెరుగ్గా సేవలు అందిస్తాం. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో విమానయాన మంత్రిత్వ శాఖ వేగంగా అభివృద్ధి చెందుతోంది. మన అభివృద్ధి, ఆర్థిక వ్యవస్థలో మార్పులు, టెక్నాలజీ వినియోగం కారణంగా ప్రపంచ దేశాలు భారత్ వెటకపు చూస్తున్నాయి. తెలంగాణలో వరంగల్ విమానాశ్రయంతో పాటు, ఏపీలోని భోగాపురం ఎయిర్‌పోర్టులను త్వరగా పూర్తి చేయాలని భావిస్తున్నాం. 2026 జూన్ కల్లా భోగాపురం విమానాశ్రయం పూర్తి చేస్తాం. విమానాశ్రయంలో ప్రిడిక్టివ్ ఆపరేషన్ సెంటర్ ప్రారంభించడం ఒక మైలు రాయని అన్నారు. విమానాశ్రయాల సౌత్ అండ్ చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ ఎస్‌జీకే కిషోర్ ఈ ఫీచర్ గురించి మాట్లాడుతూ మా కొత్త ఎనేబుల్డ్ డిజిటల్ ప్లాట్‌ఫారమ్, ఎయిర్‌పోర్ట్ ప్రిడిక్టివ్ ఆపరేషన్ సెంటర్ పనులను ఆధునీకరించడంలో, ప్రయాణికులకు మెరుగైన సేవల్ని అందిస్తుంది. రియల్ టైమ్ డేటా విశ్లేషణ, ప్యాసింజర్స్ వెయిటింగ్ టైమ్ తగ్గించనున్నాం. మెరుగైన భద్రతా సేవలు లభిస్తాయి. భారత్‌లో 73 శాతం ఈ-కామర్స్, టెక్ స్టార్టప్‌లు వెబ్ 3.0 అప్లికేషన్‌ల ఉద్యోగాల వైపు మొగ్గుచూపుతున్నారని నివేదిక వచ్చిందని తెలిపారు.

## ఈ నెల 15, 16న గ్రూప్ 2 పరీక్షలు

హైదరాబాద్ డిసెంబర్ 11(నిఘా న్యూస్) గ్రూప్- 2 పరీక్షలకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏర్పాట్లు సిద్ధం చేసింది. డిసెంబర్ 15, 16 తేదీల్లో జరిగే ఈ పరీక్షల కోసం సెంటర్ల వద్ద పకడ్బందీ చర్యలను చేపట్టనుంది. మరోవైపు ఇప్పటికే హాల్ టికెట్లను కూడా అందుబాటులోకి తీసుకొచ్చింది. అయితే హాల్‌టికెట్ల డౌన్‌లోడ్ ప్రక్రియలో ఎదురయ్యే ఇబ్బందులను పరిష్కరించేందుకు టీజీపీఎస్సీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. అభ్యర్థుల ఇబ్బందులను నివృత్తి చేసేందుకు జిల్లాల వారీగా హెల్ప్ లైన్ నంబర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ మేరకు ఫోన్ నెంబర్లతో కూడిన జాబితాను వెబ్ సైట్ లో విడుదల చేసింది. ఈనెల 15, 16 తేదీల్లో గ్రూప్ 2 పరీక్షలను నిర్వహించనున్నారు. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా 1368 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇక హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ సమయంలో ఏవైనా సాంకేతిక ఇబ్బందులు వస్తే 040-23542185 లేదా 040-23542187 నంబర్లకు సంప్రదించవచ్చు. ఈ-మెయిల్ సందేహాలు పంపవచ్చని టీజీపీఎస్సీ పేర్కొంది. గ్రూప్-2 ఎగ్జామ్ లో భాగంగా మొత్తం 4 పేపర్లు ఉంటాయి. టీజీపీఎస్సీ నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం పేపర్-1 డిసెంబరు 15వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించనున్నారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్-2 ఉంటుంది.ఇక డిసెంబరు 16వ తేదీన పేపర్?3, 4 పరీక్షలు నిర్వహించనున్నారు. గ్రూప్-2 ప్రతి పేపరులో 150 ప్రశ్నలు 150 మార్కులకు నిర్వహించనున్నారు.

## ఆశల పల్లకిలో కేటీఆర్

**మొదటి పేజీ తరువాయి...**

అందుకే నాలుగేళ్లలో అధికారం వస్తుందని పగటి కలలు కంటున్నారని విమర్శించారు. ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ విగ్రహాలను ఎవరూ తొలగించలేరన్నారు. ఎమ్మెల్యేల శిక్షణా తరగతులకు రావొద్దని కేటీఆర్ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందా అని ఎద్దేవా చేశారు. తెలంగాణ తల్లి విషయంలో కావాలని రాజకీయం చేస్తున్నారని ధ్వజమెత్తారు.



ఇల్లందు మండలం బాలాజీ నగర్ పంచాయతీలో దార శ్రీను పుష్ప మనవరాలి ఆశీర్వాద కార్యక్రమంలో పాల్గొన్న ఆదివాసి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పొడుగు రాంబాబు చీమల మల్లేష్ సూర్ణ పాక హనుమంత్ గూడా బాబురావు మొగిలి ఎమ్.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

-ఇల్లందు, డిసెంబర్ 11 (నిఘా న్యూస్):

## విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేత



**హైదరాబాద్/రాంనగర్, డిసెంబర్ 11 (నిఘా న్యూస్):** శ్రీ ఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు పాలపర్తి సంధ్యారాణి ప్రతి నెల నిర్వహించే కార్యక్రమాల్లో భాగంగా బుధవారం రాంనగర్ లోని ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు నోట్‌బుక్స్ అందించడం జరిగింది. ప్రతి సంవత్సరం ప్రభుత్వ పాఠశాలల్లో నోట్ బుక్స్ పంచి పెడతామని, ఈసారి శాంతా, వసంత చారిటబుల్ ట్రస్ట్ వారి సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్తమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు డా.సురేష్ కుమార్ పాఠశాల సిబ్బంది మాధవి, వాణి తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ రింగ్ రోడ్డు వద్ద జర్నలిస్టులు నిరసన



**ఉప్పల్, డిసెంబర్ 11 (నిఘా న్యూస్):** జర్నలిస్టులపై మోహన్ బాబు దాడి చేయడం హేయమైన చర్యయని జర్నలిస్టు సంఘాలు అన్నారు. జర్నలిస్ట్ రంజిత్ పై మోహన్ బాబు చేసిన దాడికి నిరసనగా బుధవారం ఉప్పల్ రింగ్ రోడ్డు వద్ద జర్నలిస్టులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ సినీ నటుడు మోహన్ బాబును పోలీసులు వెంటనే అరెస్ట్ చేసి జర్నలిస్టులకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కుటుంబ కలహాలు మీడియా ముందుకు రాకూడదని, మీడియా ప్రతినిధులు తమ వృత్తిపరమైన విధులు తాము చేస్తున్న నేపథ్యంలో వారిపై భౌతిక దాడులు చేయటం ఎంతమాత్రం ఆమోద్యయోగ్యం కాదన్నారు. హాస్పిటల్ లో చికిత్స తీసుకుంటున్న జర్నలిస్టు రంజిత్ బహిరంగ క్షమాపణ చెప్పి వైద్య ఖర్చులు మోహన్ బాబు భరించాలన్నారు. ఇలాంటి దారుణాలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేవారు ఎలాంటి వారైనా ప్రజాకోర్టులో నిలబడాల్సిందేనని హెచ్చరించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని కాపాడి పత్రికా స్వేచ్ఛకు భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


## జేఎంజె పాఠశాలలో సీఎం కప్ ఆటల పోటీలు



**మనోహరాబాద్, డిసెంబర్ 11 (నిఘా న్యూస్):** మెదక్ జిల్లా మనోహరాబాద్ మండల కేంద్రంలో సీఎం కప్ టోర్నమెంట్ ఆట పోటీలను జేఎంజె స్కూల్ లో అధికారికంగా నిర్వహిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ పోటీలలో పాఠశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొని ఆరోగ్యాన్ని పెంపొందించు కోవాలన్న ఉద్దేశంతో అంతేకాకుండా దేశవాలి పోటీల్లో ఆడేందుకు విద్యార్థులకు అవగాహన కలుగుతుందని భావనతో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం వాలీబాల్, కోకో ఆటలను నిర్వహించారు. ఈ ఆట పోటీల్లో మండల అధికారులతో పాటు మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## శంభోమహేశ్వర ధ్వజస్తంభం ప్రతిష్ట

### సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధ పూజలు



**జిన్నారం, డిసెంబర్ 11 (నిఘా న్యూస్):** మంగంపేట్ గ్రామంలో శ్రీశ్రీశ్రీ శంభోమహేశ్వర ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవాలు ఘనంగా సాగాయి. సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అమీన్ పూర్ 15వ వార్డ్ కౌన్సిలర్ కాట సుధా గౌడ్ ఈ ఉత్సవానికి హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సుధా గౌడ్ ని వేద మంత్రోచ్చారణలతో ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు.

# ఘనంగా పౌల్ట్రీ లెజెండ్ శేషయ్య జయంతి వేడుకలు

### షాద్ నగర్ కమ్మ సేవా సమితి అధ్యక్షులు పాతూరి వెంకట్ రావు





**షాద్ నగర్, డిసంబర్ 11 (నిఘా న్యూస్):** షాద్ నగర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎం పి శేషయ్య నగర్ కమ్యూనిటీ హాల్ నందు కమ్మ సేవా సమితి అధ్యక్షులు పాతూరి వెంకట్ రావు ఆద్వర్యంలో కి.శే ఎంపీ శేషయ్య 90వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పాతూరి వెంకట్ రావు మాట్లాడుతూ షాద్ నగర్ ప్రాంతంలో పౌల్ట్రీ పరిశ్రమ స్థాపనకు నడుం బిగించి పౌల్ట్రీ రైతులను ప్రోత్సహించి ఈ రోజు ఆసియా లోనే అత్యధికంగా గుడ్లు ఉత్పత్తి జరుగుతున్న ప్రాతం మన షాద్ నగర్ అన్నారు. ఆనాడు ఆయన కృషి ఫలితంగానే ఈనాడు అందరం ఐక్యంగా పరిశ్రమను నడిపిస్తూ ఆయన ఆశయ సాధనలో భాగం అయినాము అన్నారు. ఆయన ఇచ్చిన స్థలం ప్రోత్సాహంతోనే ఈ కమ్యూనిటీ హాల్ ఏర్పాటు అయిందని, ఆయన జ్ఞాపకార్థం ఎంపీ శేషయ్య నాగరత్నమ్మ కమ్యూనిటీ ట్రస్ట్ సెంటర్ నీ నెలకొల్పి ఆయన విగ్రహాన్ని నెలకొల్పుకొని ఆయన ఆశయాలను ముందుకు తీసుకు పోవటం చాల సంతోష దాయకం అన్నారు. ఈ కార్యక్రమంలో మన్నవ శరత్, గుదే వసంత రావు, బండారుపల్లి నాగేశ్వర్ రావు, పినపాక ప్రభాకర్, మాక్కపాటి మల్లేశ్వర రావు, పాతూరి సత్యనారాయణ, కుకుట్ల సత్యనారాయణ, జొన్నల గడ్డ శ్రీనివాస్ రావు, కొర్రపాటి శ్రీను, వెంకట్రావు, నాగేశ్వర్ రావు, శివ మోహనరావు, మస్తాన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ఉపనిషత్తుల సారాంశమే భగవద్గీత

### ప్రముఖ ధార్మికవేత్త సద్గురు భానుమతమ్మ ఘనంగా ముగిసిన గీతా జయంతి వేడుకలు



**కర్నూలు, డిసెంబర్ 11 (నిఘా న్యూస్):** భగవద్గీత ఉపనిషత్తుల సారాంశమని, బ్రహ్మ విద్య అని, అటువంటి బ్రహ్మవిద్య అయిన భగవద్గీతపై శ్రద్ధ కలగాలంటే ఎన్నో జన్మల సుకృతం ఉంటేనే సాధ్యమవుతుందని, ప్రముఖ ధార్మికవేత్త, విశ్రాంత అద్యాపకురాలు సద్గురు భానుమతమ్మ అన్నారు. విద్యాప్రకాశానందగిరి స్వామి గీతా ప్రచార ధామం, కర్నూలు వారి ఆధ్వర్యంలో భగవద్గీత సహస్ర గళార్చన పేరుతో నిర్వహించిన గీతా జయంతి వేడుకల సందర్భంగా వారు ముగింపు సభా కార్యక్రమంలో ముఖ్య వక్తగా పాల్గొని ప్రసంగించారు. భగవద్గీతపై భక్తులకు ఉన్న అనేక సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో దాదాపు రెండు వేల మంది పాల్గొన్నారు. గీతా ప్రచార సంఘం అధ్యక్షులు గీతారత్న డి.వి.రమణ గీతా ప్రచారానికి చేస్తున్న కృషిని పలువురు ప్రశంసించారు. భగవద్గీతలో ప్రతిభ కనబరిచి, మైసూరు దత్తపీఠం నుండి బంగారు పథకం సాధించిన రాయచోటి నాగ జ్యోతిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కర్నూలు నగర కమీషనర్ రవీంద్ర బాబు, చిన్మయ మిషన్ మాతా సుప్రేమానంద, గీతా ప్రచార సంఘం సభ్యులు ఇల్లూరు రమణ, సింహాద్రి రమేశ్, జగన్, అనంత అనిల్, మహాబలేశ్వర్, నాగోజీ, సత్యసాయి సేవాసమితి బృందంతో పాటు, వివిధ ధార్మిక సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలను అరికట్టాలి



**పరవాడ, డిసెంబర్ 11 (నిఘా న్యూస్):** బాల్యవివాహాల నిర్మూలనకు అందరూ ముందుకు రావాలని పరవాడ ఎంపీడీవో శ్యాంసుందర్ పిలుపునిచ్చారు. బుధవారం పరవాడ మండలం పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కిశోరి వికాసం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. బాలికలను ఉన్నత విద్యావంతులుగా చేయాలన్నారు. వివా హాలను ప్రోత్సహించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

## ఛావోలు సుంకన్నకు బైరెడ్డి నివాళులు



**నంద్యాల, డిసెంబర్ 11 (నిఘా న్యూస్):** పగిడ్యాల మండలం ముచ్చుమర్రి గ్రామానికి చెందిన చావోలు సుంకన్న అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం ముచ్చు మర్రిలోని సుంకన్న కుటుంబాన్ని పరామర్శించి, మృతుడు కుటుంబానికి సానుభూతి తెలిపారు.

## టోల్గేట్ వద్ద చిరు దుకాణాల తరలింపు



**తూప్రాన్, డిసెంబర్ 11 (నిఘా న్యూస్):** తూప్రాన్ మున్సిపల్ పరిధిలో టోల్ గేట్ సమీపంలో కూరగాయల, పండ్ల చిరు వ్యాపారులు రోడ్లపై దుకాణాలను సమకూర్చుకొని అమ్మకాలు జరుపుతున్నారు. రోడ్డును ఆక్రమించుకొని వ్యాపారాలు కొనసాగించే స్థలములో కంటైనర్లు, లైన్ బండ్లు, కార్లు నిలిపి పండ్లు, కూరగాయలు కొనుగోలు చేసే సమయంలో పూర్తిగా రోడ్డుపై రద్దీ ఏర్పడడం జరుగుతుంది. దీన్ని దృష్ట్యా ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున సమీప ప్రజల ఫిర్యాదు మేరకు తూప్రాన్ మున్సిపల్ చైర్పర్సన్ మామిండ్ల జ్యోతి ముదిరాజ్, ప్రత్యేక దృష్టిని సారించి చిరు వ్యాపారస్తులను సముదాయించి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ప్రమాదాలు చోటు చేసుకోకుండా వారిని వెనుకకు జరిపి వ్యాపారాలు చేసుకునే విధంగా మార్కింగ్ చేయడం జరిగింది. ఇందులో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మామిళ్ళ కృష్ణ, కమిషనర్ పాతూరి గణేష్ రెడ్డి, కౌన్సిలర్ జిన్నా భగవాన్ రెడ్డి లు వ్యాపారులను మెప్పించి ఒప్పించి వారిని మార్కెట్ లోపలికి జరపడంతో ఫిర్యాదు చేసిన ప్రజలు మున్సిపల్ చైర్మన్, కమిషనర్ కు ధన్యవాదాలు తెలియజేశారు.

# సీసీ కెమెరాకు కాలనీవాసుల విరాళం

### బీరప్ప గడ్డ సంక్షేమ సంఘానికి పలువురి అభినందనలు



**చిలుకానగర్, డిసెంబర్ 11 (నిఘా న్యూస్):** చిలకా నగర్ డివిజన్ లోని బీరప్ప గడ్డ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వారి అసోసియేషన్ సభ్యుల ప్రోత్బలంతో జివిపి పాయింట్ వద్ద కెమెరాను ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ ని కోరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గీత మోటివేషన్ తో కాలనీ అసోసియేషన్ సభ్యులు బస్తీ వాసులతో మాట్లాడి వారి సొంత నిధులతో కెమెరాను ఏర్పాటు చేయాలన్న సంకల్పంతో బుధవారం జివిపి పాయింట్ వద్ద కెమెరాకు కావలసిన డబ్బులను (కాంట్రిబ్యూషన్) ను ఏఎంహెచ్ఓ మైత్రేయికి టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా బన్నాల ప్రవీణ్ మాట్లాడుతూ చిలుకానగర్ డివిజన్లో ఇప్పటికీ సుమారు ఎనిమిది కెమెరాలు కాలనీ సంక్షేమ సంఘాల సౌజన్యంతో ఏర్పాటు చేసుకోవడం జరిగిందని తెలిపారు. బస్తీలలో సమాజం పట్ల అవగాహన కలిగిస్తూ మన బస్తి బాగుండాలంటే మనము కూడా తలా ఒక చేయి వేయాలని బస్తీ బాగోగులో మన వంతు సహకారం కూడా ఉండాలన్నా ఒక గొప్ప సంకల్పంతో బీరప్ప గడ్డ బస్తివాసులు ముందుకు వచ్చినందుకు వారిని ప్రత్యేకంగా అభినందిస్తూ బస్తీ వాసులకు అసోసియేషన్ సభ్యులకు బన్నాల ప్రవీణ్ ధన్యవాదాలు తెలిపారు. ఏ ఎం హెచ్ ఓ మైత్రేయి మాట్లాడుతూ బస్తీలలో జీవీపీ పాయింట్ల వద్ద కెమెరాలకు కాంట్రిబ్యూషన్ ఇవ్వడం చాలా గొప్ప విషయమని అభినందిస్తూ బీరప్ప గడ్డలో జి వి పి పాయింట్ వద్ద త్వరలో కెమెరాను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీరప్ప గడ్డ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జగన్, కార్యదర్శి రాంచందర్, అసోసియేషన్ సభ్యులు సభ్యులు, సానిటరీ ఇంచార్జ్ జగన్ తదితరులు పాల్గొన్నారు.

# క్రమబద్ధీకరణను మరోసారి చేపట్టాలి



### బిజెపి డిమాండ్

**ఇల్లందు, డిసెంబర్ 11 (నిఘా న్యూస్):** ఇల్లందు పట్టణంలో ప్రభుత్వం అమలు చేసిన క్రమబద్ధీకరణ 76 జీఓను గతంలో నిర్వహించినప్పటి,ఎంతో మంది ప్రజలు పట్టాలు పొందలేక పోయారని. ప్రభుత్వానికి చలానా లు కట్టి పట్టాలు పొందలేని వాళ్ళు అనేకంగా ఉన్నారన్నారు. ప్రజల్లో పూర్తిగా అవగాహన కల్పించక పోవడం వల్ల తెలియని వాళ్ళు దరఖాస్తు చేసుకోలేక పోయారు. ఎంతో చరిత్ర కలిగిన ఇల్లందు పట్టణంలో స్థిరాస్తి కలిగి ఉన్నప్పటికీ విలువ లేక.బ్యాంకులలో రుణ సదుపాయం పొందలేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మరో మారు క్రమబద్ధీకరణ వల్ల ప్రజలకు వారి గృహాలకు విలువ కలిగి స్వాంతన చేకూరుతుంది. కావున ప్రభుత్వం మరోసారి క్రమబద్ధీకరణ అమలుపరిచి నూటికి నూరు శాతం అర్హులైన ప్రతి ఒక్కరికీ పట్టా లు అందజేయాలని బిజెపి నాయకులు డిమాండ్ చేశారు.కానీపక్షంలోబాధితులనుకలుపుకొనిదశలవారిఆందోళనలు చేపడుతా మని స్థానిక తహసీల్దార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఓబిసి మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మావునూరి మాధవ్ జిల్లా ఉపాధ్యక్షులు గుగులోత్ రామచంద్రనాయక్ జిల్లా అధికార ప్రతినిధి దోమల మహేశ్వర్ జిల్లా ఓబీసీ నాయకులు శాసనాల రామయ్య జిల్లా మహిళా నాయకురాలు సుచిత్ర పాసి పట్టణ ఉపాధ్యక్షులు శివకుమార్ ఖండె ల్ వాల్ యువ మోర్చా నాయకులు రాహుల్ కొలారియా నరసింహారెడ్డి పట్టణ కార్యదర్శి మండవరాజ్ శ్రీనివాస్ నక్క విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# మైనారిటీ రెసిడెన్షియల్ కళాశాలలో తనిఖీలు

### విద్యార్థుల భోజనం ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తపరిచిన మున్సిపల్ కమిషనర్



**నారాయణపేట, డిసెంబర్ 11 (నిఘా న్యూస్):** విద్యార్థుల భోజనం ఉన్నత నాణ్యత ప్రమాణాలతో ఏర్పాటు చేయాలని నారాయణపేట మున్సిపల్ కమిషనర్ వి.సునీత అన్నారు. బుధవారం మున్సిపల్ కమీషనర్ నారాయణపేటలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె తనిఖీ సమయంలో ఆమె ఆహార పదార్థాల నాణ్యతను క్షుణ్ణంగా పరిశీలించారు. పరిశుభ్రత ప్రమాణాలను అంచనా వేసి అన్ని అడ్మినిస్ట్రేటివ్ రిజిస్టర్లను సమీక్షించారు. కళాశాల మొత్తం నిర్వహణ పట్ల తన సంతృప్తిని వ్యక్తం చేశారు. విద్యార్థుల శ్రేయస్సు, అభివృద్ధిని నిర్ధారించడానికి ఈ ఉన్నత ప్రమాణాలను కొనసాగించాలని ఆమె బృందాన్ని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో నారాయణపేట జిల్లా మైనారిటీ అధికారి ఎంఏ రషీద్, ఆర్.ఎల్.సి కాజా బహుద్దీన్, జిల్లా కోఆర్డినేటర్ సలీం కళాశాల వంటగది, బియ్యం సరుకులు పరిశీలించారు. స్టాఫ్ రిజిస్టర్ స్టాక్ రిజిస్టర్ పరిశీలించి నాణ్యత ప్రమాణాలు పాటించాలని పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలన్నారు. మోడల్ ప్రశ్నల పరీక్ష ప్రక్రియను పరిశీలించి అధ్యాపక బృందాన్ని అభినందించారు. నీట్, జెఈఈ పరీక్షల నిర్వహణపై శ్రద్ధ చూపాలని ప్రిన్సిపాల్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జగదీష్ తదితరులు ఉన్నారు.

## పెబ్బేరులో గీతా జయంతి వేడుకలు



**పెబ్బేరు, డిసెంబర్ 11 (నిఘా న్యూస్):** పెబ్బేరు మున్సిపాలిటీలోని శ్రీశ్రీశ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో బుధవారం గీతా జయంతి ఉత్సవాలను వేణుగోపాలస్వామి ఆలయ భూపరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వేణుగోపాలస్వామి వారికి అభిషేకాలు, అష్టోత్తరాలు, ప్రత్యేక పూజలు,గీతా పారాయణం నిర్వహించారు. ఆలయంలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఆవరణలో జమ్మి మొక్కను నాటారు. సాయంత్రం ఆలయంలో శివ మారుతి భజన మండలి, అయ్యప్ప స్వామి భజన మండలి, శిరిడి సాయి భజన మండలి, ఆధ్వర్యంలో భజన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అల్ప అల్పాహార వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హిందూ జాగృతం సభ్యులు మాట్లాడుతూ భగవద్గీత ప్రపంచానికే ఆదర్శప్రాయమైన గ్రంథమన్నారు. కార్యక్రమంలో వేణుగోపాలస్వామి ఆలయ భూ పరిరక్షణ సమితి సభ్యులు,హిందూ జాగృతం సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## యువతను ప్రోత్సహించేందుకే క్రీడలు

### బడంగ్ పేట్ మున్సిపల్ మేయర్ పారిజాత



**బాలాపూర్, డిసెంబర్ 11 (నిఘా న్యూస్):** శరీర దారుఢ్యతకు క్రీడలు ఎంతో దోహదపడతాయని బడంగ్ పేట్ మున్సిపల్ మేయర్ చిగిరింత పారిజాత అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పోరేషన్ మున్సిపల్ గ్రౌండ్ లో జరిగిన సీఎం కప్ కబడ్డీ, ఖో ఖో, వాలీబాల్ క్రీడా పోటీలను టిపిసిసి ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులను గుర్తించడానికి ఈ పోటీలు ఉపయోగపడ తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఇబ్రమ్ శేఖర్, ఎంఈవో కృష్ణయ్య, కమిషనర్ పి.సరస్వతి, కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్ రెడ్డి, పెద్దబావి సుదర్శన్ రెడ్డి, నాయకులు రాళ్లగూడెం శ్రీనివాస్ రెడ్డి, బొర్ర జగన్ రెడ్డి, సుభాన్ యాదవ్, గుర్రం లక్ష్మారెడ్డి, జక్కిడి విష్ణువర్ధన్ రెడ్డి, లక్కీశెట్టి మనోహర్, క్యారగారి శ్రీధర్, రమేష్ గౌడ్, వెంకటేష్ గౌడ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంబర్ పేటలో సీఎం కప్ క్రీడలు ప్రారంభం



**అంబర్ పేట, డిసెంబర్ 11 (నిఘా న్యూస్):** అంబర్ పేటలో మండల స్థాయి సీఎం కప్-2024 క్రీడా పోటీలు స్థానిక మున్సిపల్ గ్రౌండ్ లో బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో అంబర్ పేట తహసిల్దార్ వీరాబాయి, కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి శంభుల శ్రీకాంత్ గౌడ్, సర్కిల్ ఇన్స్పెక్టర్ అశోక్, ఉప విద్యాశాఖ అధికారి తదితరులు పాల్గొని క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలలో పెద్ద సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు.కబడ్డీ, కోకో, ఫుట్ బాల్, వాలీబాల్ తదితర విభాగాల్లో పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో తహసిల్దార్ మాట్లాడుతూ మండల స్థాయిలో సీఎం కప్- 2024 క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు, విద్యార్థులు యువకులు పోటీలలో పాల్గొనాలని కోరారు. జింఖానా గ్రౌండ్స్‌లో గురువారం అథ్లెటిక్స్ ఈవెంట్లు జరగనున్నాయని తహసిల్దార్ పేర్కొన్నారు.

## ఎస్సీ వర్గీకరణను వేగవంతం చేయాలి



**అడ్డగూడూరు, డిసెంబర్ 11 (నిఘా న్యూస్):** తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ కులాల విచారణ కమిషన్ ఆధ్వర్యంలో షెడ్యూల్ కులాల్లో ఉప వర్గీకరణపై వివరణాత్మక అధ్యయనం కోసం జరుగుతున్న సమావేశానికి తమ వంతు బాధ్యతగా హాజరై తెలంగాణ రాష్ట్ర మాజీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్.షమిమ్ అక్తర్ కి, వర్గీకరణ ఏకసభ్య కమిషన్ చైర్మన్ కి సుప్రీంకోర్టు తీర్పును అనుగుణంగా రాష్ట్రంలోని ఎస్సీ లను ఏ బి సి డి గ్రూపులుగా వర్గీకరించి, అత్యంత వెనుకబడిన మాదిగ, చర్మకార,పారిశుద్ధ్య కులాల వారికి విద్యా, వైద్యం,ఉద్యోగ రంగాలలో అత్యధిక ప్రాధాన్యతలతో కూడిన జనాభా దామాషా ప్రకారం ప్రాతినిధ్య న్యాయం కల్పించాలని వినతిపత్రం అందజేసిన ఎమ్మార్పీఎస్ యాదగిరిగుట్ట జిల్లా ఇంచార్జ్ కూరేళ్ల రమేష్ మాదిగ,జిల్లా అధ్యక్షుడు భూషి మహేష్ మాదిగ,రాష్ట్ర కార్యదర్శి బైరిపాక నాగరాజు మాదిగ,జిల్లా అధికార ప్రతినిధి గుర్రం మహేందర్ మాదిగ, యాదగిరిగుట్ట జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బాలెంల పరుశరాములు మాదిగ,జిల్లా ఉపాధ్యక్షుడు కొంపెల్లి భాస్కర్ మాదిగ, ఎం ఎస్ ఎఫ్ జిల్లా ఇంచార్జ్ కొంపెల్లి వెంకట్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ పనులను వేగవంతం చేయండి

- త్వరలో బొల్లారం, అమీన్పూర్, తెల్లాపూర్, బీరంగూడ పరిధిలో నూతన రిజర్వాయర్ల నిర్మాణం
- జలమండలి సమీక్షలో ఎమ్మెల్యే జిఎంఆర్



**పటాన్ చెరు, డిసెంబర్ 11 (నిఘా న్యూస్):** జలమండలి ఆధ్వర్యంలో ఓ ఆర్ ఆర్ ఫేజ్ 2 పరిధిలో చేపడుతున్న రిజర్వాయర్ల పనులను త్వరితగతిన పూర్తి చేసి, ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు అందించాలని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం పటాన్చెరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జలమండలి అధికారులతో ఎంఎల్ఏ జిఎంఆర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. మూడు మున్సిపాలిటీల పరిధిలో జలమండలి ఆధ్వర్యంలో చేపడుతున్న పనుల ప్రగతిని ఎంఎల్ఏ కు వివరించారు. ప్రధానంగా బొల్లారం బీరంగూడ అమీన్పూర్ తెల్లాపూర్ పరిధిలో రిజర్వాయర్ల నిర్మాణ పనులు పూర్తి అయ్యాయని తెలిపారు. రాబోయే 15 రోజుల్లో పంపింగ్ పనులు సైతం పూర్తి చేసి నీటిని విడుదల చేసేందుకు ప్రణాళికల సిద్ధం చేసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. మూడు మున్సిపాలిటీల పరిధిలో ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు అందించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు. కాలుష్య జలాలతో ఇబ్బంది పడుతున్న బొల్లారం మున్సిపల్ పరిధిలో ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని సూచించారు. పైపులైన్ల లీకేజీ విషయంలో త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జలమండలి జిఎం సుబ్బారాయుడు, డీజీఎంలు చంద్రశేఖర్, శివకుమార్, ఏఈలు ప్రవీణ్, పూర్ణేశ్వరి, శ్రీనివాస్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి లక్ష్యాల సాధన




## ఇన్చార్జి ఎంపీడీవో శ్రీనివాసరావు

**బెల్లంకొండ, డిసెంబర్ 11 (నిఘా న్యూస్):** ప్రజల ప్రస్తుత అవసరాలకు తగిన విధంగా వనరులను వినియోగం భవిష్యత్ అవసరాలకు తగిన విధంగా మెరుగు పరచటే లక్ష్యంగా సమిష్టి కృషి చేయాల్సిన అవసరం ఉందని ఇన్చార్జి ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారుద. బుధవారం రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ నిధులతో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి, పంచాయతీరాజ్ శిక్షణ సంస్థ వారి ఆధ్వర్యంలో మండల ప్రజా ప్రతినిధులకు పంచాయతీ అధికారులకు శిక్షణ కార్యక్రమం మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. ఆరోగ్యవంతమైన గ్రామం పేదరికం లేని మెరుగైన జీవనోపాధి గ్రామం బాలహిత పంచాయితీలు నీటి సమృద్ధి గల గ్రామం పరిశుభ్రమైన పచ్చనైన గ్రామం స్వయం సమృద్ధి తో మౌలిక సదుపాయాల గల గ్రామం సామాజిక న్యాయం, సామాజికంగా భద్రత కలిగిన గ్రామం సుపరిపాలన కలిగిన గ్రామం మహిళా స్నేహ పూర్వక గ్రామం తదితర అంశముల పై శిక్షణ ఇవ్వడం జరిగింది శిఖా శాంసన్ ఆరోగ్య విస్తరణ అధికారి మాధవి ఐసిడిఎస్ సూపర్వైజర్ గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇంజనీర్ ఏపీ ఎంఓ వెంకటేశ్వర్లు కృప వేణి పంచాయితీ కార్యదర్శిలు తదితరులు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది ఆరోగ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పిసిఓడి వ్యాధిపై అవగాహన అవసరం

## ప్రసూతి వైద్య నిపుణులు డాక్టర్.బి.నీలోహిత



**హైదరాబాద్, డిసెంబర్ 11 (నిఘా న్యూస్):** పాలిసిస్టిక్ అండాశయ వ్యాధిని అనుసరించి యుక్తవయసు బాలికలు, మహిళలు అవగాహన కలిగి ఉండవలసిన ఆవశ్యకత ఉందని మాస్టర్ ఆఫ్ సర్జరీ, ప్రసూతి వైద్య నిపుణులు డాక్టర్ బి. నీలోహిత వెల్లడించారు. యుక్త వయసులో ఉన్న బాలికలకు, మహిళలకు పిసిఓడి వ్యాధి రావడానికి ఆస్కారం ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలోని అమీర్ పేట్ జనరల్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రావుఫ్, ఆర్.ఎం.ఓ డాక్టర్ వినాయక్ రావ్ ఆధ్వర్యంలో ఆసుపత్రికి వైద్యం నిమిత్తం సందర్శించిన బాలికలకు, మహిళలకు, గర్భవతులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని వివరించారు. గర్భిణీ స్త్రీలకు సాధారణ ప్రసవాలు చేయడానికే అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని స్పష్టంగా తెలిపారు. గర్భవతులు సైతం సాధారణ ప్రసవాలు చేసుకోవడానికి సంసిద్ధులై ఆసుపత్రికి రావాలని కోరారు. పి.సీ.ఓ.డి లక్షణాలు తెలిపారు. మహిళలకు జరిగే నెలవారి ప్రక్రియ సక్రమంగా జరగకపోవడం. కొందరు మహిళల్లో రెండు మూడు నెలలకు ఒకసారి నెలవారి ప్రక్రియ జరగడం. వివాహిత మహిళలు గర్భవతులు కాకపోవడం. యుక్త వయసులో ఉన్న బాలికల ముఖం పైన మొటిమలు రావడం. ముఖంపై వెంట్రుకలు రావడం, తదితర లక్షణాలు కనిపించిన వెంటనే ప్రసూతి వైద్య నిపుణులను సంప్రదించి, నాణ్యమైన వైద్య సేవలు పొందాలని వెల్లడించారు. వ్యాధి నివారణలో భాగంగా డాక్టర్లు అవసరాన్ని బట్టి అల్ట్రా సౌండ్ స్కానింగ్ పరీక్షలు చేయించి, అండా శయ సమస్యలు తెలుసుకోవడం జరుగుతుందన్నారు.హార్మోన్ల సమతుల్యత పరీక్షలు చేయించి నాణ్యమైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని మహిళలకు భరోసా కల్పించారు. కారణాలు తెలిపారు. ఫాస్ట్ ఫుడ్, జంక్ ఫుడ్ కు అలవాటు పడడం. శరీరానికి తగిన వ్యాయామం లేకపోవడం. అధిక ఒత్తిడికి గురి కావడం, సరియైన సమయంలో సరైన నిద్ర చేయకపోవడం కారణాలు తెలిపారు. లావుగా ఉన్నవారికి, సన్నగా ఉన్నవారికి సైతం ఈ వ్యాధి సంక్రమిస్తుందని తెలిపారు. ఆరోగ్య నియమావళిలో భాగంగా ప్రతి ఒక్కరూ పోషక విలువలు కలిగిన ఆహారం సమయాను సారంగా, సమతుల్యంగా తీసుకోవడం నిత్యజీవితంలో అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. సమయానుసారంగా నిద్ర చేయడం. ఒత్తిడికి గురి కాకుండా ఉండడం, ఆరోగ్య వాతావరణంలో జీవించడం ఉత్తమమైన మార్గమని హితవు పలికారు.

# భగవద్గీత పారాయణం పుణ్య ఫలం




**ప్రొద్దుటూరు, డిసెంబర్ 11 (నిఘా న్యూస్):** భగవద్గీత పారాయణం పుణ్య ఫలమని శివదర్శనానంద స్పిరిచ్యువల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు శివదర్శనానంద సరస్వతీ మాతాజీ తెలిపారు. బుధవారం స్థానిక ఎర్రగుంట్ల రోడ్డులోని త్యాగరాజరెడ్డి కళ్యాణ మండపంలో ట్రస్ట్ ఆధ్వర్యంలో గీతాజయంతి సందర్భంగా రాష్ట్రస్థాయి భగవద్గీత పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. ఈ సందర్భంగా మాతాజి మాట్లాడుతూ భగవద్గీత పారాయణం చేయడం వల్ల మనిషి ఆదర్శవంతమైన, ఆనందమయమైన జీవితం పొందవచ్చుని వివరించారు. భవద్గీత చదవడం వల్ల పిల్లల్లో ఏకాగ్రత మెరుగు పడుతుందని గీత గొప్పతనాన్ని తెలియజేశారు. భగవద్గీత జ్ఞానాన్ని అందించేందుకు అందరికి గీతా గ్రంథాన్ని అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. మానవునిలో ఆలోచనా దృక్పదం మారి చెడుగుణాలు, వ్యసనాలు వదలి వేసి సంపూర్ణ మానవునిగా జీవించేందకు గ్రంథం ఉపకరిస్తుందన్నారు. భగవద్గీత గొప్పతనాన్ని గుర్తించిన పాశ్చాత్య దేశాలు తమ భాషలోని అనువాదం చేసుకున్నాయన్నారు. భగవద్గీత మొదటి అధ్యాయం అర్జున విశాద యోగం పఠన పోటీలను నాలుగు విభాగాలుగా నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. ప్రథమ స్థానంలో నిలిచిన టి.జితిన్, జి. త్రిషిత, ఎం.మానస, ఎన్.వెంకట జయశ్రీలకు ఒక్కొక్కరికి రూ. 10వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన తుషారిక, ఆర్.ధన్విత, సి.సంతోష్, వై. శ్రీభావనలకు ఒక్కొరికి రూ.6వేలు చొప్పున 8 మంది విద్యార్థులకు మొత్తం రూ.64వేలు, మెమెంటోలు అందచేశారు. ఈ సందర్భంగా వెయ్యి మంది పైగా భక్తులు సామూహికంగా భగవద్గీతా పారాయణం చేశారు. అలాగే 2025 క్యాలెండరును మాతాజి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ట్రస్టీ పల్లేటి ప్రభాకరరెడ్డి భక్తులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సులతో భూ సమస్యల పరిష్కారం

### తహసీల్దార్ షేక్ అష్రుపున్నీసా బేగం



**బెల్లంకొండ, డిసెంబర్ 11 (నిఘా న్యూస్):** రైతులు రైతు సదస్సుల కార్యక్రమాల్లో పాల్గొని తమ భూ సమస్యలను పరిష్కరించుకోవాలని తహసిల్దార్ షేక్ అశ్రీ ఫన్నిసా బేగం తెలిపారు. బుధవారం మండలంలోని గంగిరెడ్డిపాలెం గ్రామంలో రెవిన్యూ సదస్సును నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామంలో 6 మంది అర్జీలు సమర్పించారని వాటిని పరిశీలించి త్వరగతిన పరిష్కారం చూపుతామన్నారు. ఆసుల జగన్ మాట్లాడుతూ గత పాలకుల వల్ల భూ సమస్యలు పెరిగి రైతులు అవస్థలు పడుతున్నారని వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెదేపా సీనియర్ నాయకులు సర్పంచ్ ఆసుల జగన్ అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యల శాశ్వత పరిష్కారమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ అధికారులు సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

## చెత్తను చెత్తకుండీలలో మాత్రమే వేయాలి



**ప్రొద్దుటూరు, డిసెంబర్ 11 (నిఘా న్యూస్):** ప్రజలు చెత్తను చెత్తకుండీలలో మాత్రమే వేయాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తెలిపారు. కమిషనర్ పట్టణ పర్యటనలో భాగంగా స్థానిక రాజీవ్ సర్కిల్ వద్ద వున్న ప్రధాన కాలువ యందు పేరుకోపోయిన సిల్ట్ ను పారిశుధ్య కార్మికులచే తొలగించారు. అలాగే సుబ్బిరెడ్డి కొట్టాలు (చౌడేశ్వరి నగర్) నందు పర్యటించి అక్కడ పారిశుధ్య పనులను పర్యవేక్షించడం జరిగింది. అక్కడి ప్రజలతో చెత్త సేకరణ మరియు మంచినీటి సరఫరా మరియు వీధి దీపాల సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. హెూమస్ పేటలోని ప్రధాన టీ షాప్ యజమానులకు తాగిన టీ కప్పులను రోడ్డు మీద వేయకుండా డస్ట్ బిన్నులలో వేయాలని ఆదేశించడం అయినది లేని యెడల వారిపై చట్టపరమైన చర్యలను తీసుకొనబడనని హెచ్చరించారు. ఈ కార్ర్యమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ వి.సుబ్బారాయుడు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన బిల్లుల బకాయిలు చెల్లించాలి

**ప్రొద్దుటూరు, డిసెంబర్ 11 (నిఘా న్యూస్):** మూవ్ మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ పట్టణ అధ్యక్షుడు హుస్సేన్ బాష మాట్లాడుతూ సెప్టెంబరు నుండి నవంబర్ వరకు నేటికీ మూడు నుంచి నాలుగు నెలలు అవుతున్న ఇంతవరకు మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు బిల్లులు, గౌరవ వేతనాలు అందలేదు, వీరికి గౌరవ వేతనం నెలకు మూడు వేలు చెల్లిస్తున్నారు. ఎక్కడికైనా రోజుకు కూలీకి వెళ్లిన మధ్యాహ్నం వరకు 300 రూపాయలు వస్తాయి. కానీ మా పరిస్థితి ఇటు ప్రభుత్వం పని వదులుకోలేక ఇటు కూలిపనికి వెళ్లలేక కుటుంబాలను పోషించుకోలేక అవస్థలు పడుతున్నామని ప్రస్తుతం మార్కెట్లో నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి మార్కెట్లో అప్పు కూడా ఇవ్వని పరిస్థితి నెలకొందని ఏజెన్సీ వారు వాపోతున్నారు. కావున జిల్లా కలెక్టర్ గారు స్పందించి తక్షణమే బిల్లులు చెల్లించి వారిని ఆదుకోవాలని మూవ్ మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ సంస్థ ద్వారా మిమ్మల్ని కోరుతున్నాము. పట్టణ అధ్యక్షులు, షేక్ హుస్సేన్ బాష, ఉపాధ్యక్షుడు నజీర్ అహ్మద్, కార్యదర్శి మహమ్మద్ రఫీ,మీడియా కార్యదర్శి అస్లాం, సంయుక్త ప్రకటన విడుదల చేశారు.

## దేవాలయం ముందు బిజెపి నాయకుల నిరసన



**వేములవాడ, డిసెంబర్ 11 (నిఘా న్యూస్):** వేములవాడ రాజన్న ఆలయ కోడెల తరలింపు వ్యవహారంలో కీలక పాత్రధారి రాంబాబు అరెస్టు వ్యవహారంపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తూ దేవాలయం ముందు బిజెపి నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పట్టణ బిజెపి అధ్యక్షులు సంతోష్ బాబు మాట్లాడుతూ, మంత్రి సిఫారసు లేక ద్వారానే మంత్రి అనుచరుడు రాంబాబు 66 కోడెలను తీసుకెళ్ళి, అందులో 28 కోడేలు కబేలాకు తరలించాలని స్వయంగా ఒప్పుకోవడం పై రాష్ట్ర ప్రభుత్వం సమాధానం చెప్పి, దేవాదాయ శాఖ మంత్రిని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రెండు రోజుల క్రితం రాంబాబు తీసుకువెళ్లిన కోడెలకు తమకు సంబంధం లేదన్న ఆలయ ఈఓ ఇప్పుడు ఏం సమాధానం చెప్తారని ప్రశ్నించారు. కోడెల తరలింపు వ్యవహారంపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## విలీన గ్రామాల్లో అభివృద్ధి చెయ్యండి

### సిపిఎం పార్టీ డిమాండు



**వేములవాడ, డిసెంబర్ 11 (నిఘా న్యూస్):** వేములవాడలో విలినమైన చిన్న గ్రామాల్లో అభివృద్ధి జరుగుతాలేదని అభివృద్ధి పట్టణాలకే పరిమితం చేస్తున్నారని మున్సిపల్ లో విలీనమైన గ్రామాల రోడ్లు వాటి నిఅభివృద్ధి చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మునిసిపల్ విలీనమైన అయ్యోరుపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు ఎంత అద్వాన స్థితిలో తయారయ్యిందో చూడాలని కోరారు. అభివృద్ధి పట్టణాలకే పరిమితమైతదా అని ప్రశ్నించారు. ఈ సమస్యలను పరిష్కరించి గ్రామాల్లో అభివృద్ధి చేయలని. ఇప్పటికైనా వేములవాడ నుంచి అయ్యర్ పల్లికి వెళ్లే రహదారిని సెంట్రలు లైటు సిస్టంతో డబల్ రోడ్డుగా మార్చి నిర్మాణాలు చేపట్టాలని వేములవాడ నియోజకవర్గ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కు జిల్లా సిపిఎం పార్టీ కమిటీ సభ్యుడు గురజాల శ్రీధర్ విజ్ఞప్తి చేశారు.

## అయ్యప్ప స్వాముల వన భోజనం



**అంబర్ పేట, డిసెంబర్ 11 (నిఘా న్యూస్):** అయ్యప్ప దీక్షలను పురస్కరించుకొని అంబర్ పేటకు చెందిన కిరణ్ ఆధ్వర్యంలో ఉప్పల్ వెలుగుట్ట వద్ద బుధవారం వనభోజన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా స్వాములకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. ఈ వన భోజన కార్యక్రమంలో గురు స్వాములు కూన అశోక్, కూన కుమార్, సందీప్, సాయి, కార్తీక్, టింకు సురేష్,అమనూరి సతీష్, జెల్లీ యాదగిరి, జల్లి శ్రీమంత గిరి తదితరులు పాల్గొన్నారు.

## జ్యోతి నగర్ లో మినీ క్రిస్మస్ వేడుకలు




**మల్కాజిగిరి, డిసెంబర్ 11 (నిఘా న్యూస్):** గౌతమ్ నగర్ డివిజన్ పరిధి జ్యోతి నగర్ కమ్యూనిటీ హాల్లో అగాపె ఫెల్లోశిప్ కమిటీ ఆద్వర్యంలో మినీ క్రిస్మస్ వేడుకలు జరిగాయి. మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత యాదవ్ వేడుకల్లో ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. ఈ వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉన్నది అని ఎమ్మెల్యే అన్నారు. క్రిస్టియన్ సోదరులకు ప్రభుత్వ స్థలంలో ప్రార్థనా మందిరం ఏర్పాటు కోసం కృషి చేస్తున్నానని చెప్పారు. త్వరలోనే శుభవార్త వింటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేకల రాము యాదవ్, రావుల అంజయ్య, సిద్ధిరాములు, బైరు అనిల్, పాస్టర్ డాక్టర్.ఎమాన్యూల్, సామ్యూల్, పాస్టర్ బక్క ఎలియ,పాస్టర్ ఆనంద్, వివిధ చర్చిల పాస్టర్లు, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## మోహన్ బాబు ని వెంటనే ఆరెస్ట్ చేయాలి

### మీడియాపై దాడి పట్ల నిరసన



**అశ్వారావుపేట, డిసెంబర్ 11 (నిఘా న్యూస్):** సినీ నటుడు మంచు మోహన్ బాబు జర్నలిస్టులపై చేసిన దాడిని ఖండిస్తూ అశ్వారావుపేట రింగ్ రోడ్డు సెంటర్లో జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. జర్నలిస్టుల పట్ల దారుణంగా ప్రవర్తించిన ప్రముఖ సినీ నటుడు మోహన్ బాబు ను తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అయ్యప్ప మాలలో ఉన్న మీడియా ప్రతినిధితపై దాడి చేయడం సిగ్గుచేటు అని మండిపడ్డారు. ఈ కార్యక్రమానికి సిపిఐ జిల్లా నాయకులు సలీం సంఘీభావం తెలిపారు.

రద్దీకి తగ్గ రైల్లేవి..?

# అయ్యా అయ్యప్పా నీ దర్శనమేలా..!

- అరకొర రైళ్లతో చేతులు దులుపుకున్న రైల్వే
- రద్దీ కనుగుణంగా మరిన్ని రైళ్లను నడుపాలని విజ్ఞప్తి




**అంబర్ పేట, డిసెంబర్ 11 (నిఘా న్యూస్):** హైదరాబాద్ మహానగరం నుంచి శబరిమలైకు రైల్వేశాఖ తగినన్ని రైళ్లను నడపకపోవ దంతో అయ్యప్ప భక్తులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి ఏడాది కార్తీక మాసంలో 41 రోజుల పాటు దీక్ష చేసిన అయ్యప్ప భక్తులు శబరిమలకు వెళ్లి స్వామి వారిని దర్శించుకుంటారు. ప్రతి ఏడాది డిసెంబర్, జనవరి నెలల్లో నగరం నుంచి దాదాపు ఆరు లక్షల మందికి పైగా అయ్యప్ప భక్తులు శబరికి వెళ్లుతుంటారు. వీరిలో అధిక శాతం మంది రైళ్లలోనే శబరిమలకు వెళ్లేందుకు ఇష్టపడుతారు. సాధారంగా అయ్యప్ప భక్తులు తమ ప్రయాణ సమయంలో స్నానాలు, పూజలు చేసుకోవడానికి రైలు ప్రయాణం అనుకూలంగా ఉంటుంది. చార్జీలు తక్కువగా ఉండడంతో అయ్యప్ప భక్తులు అధిక సంఖ్యలో రైళ్లలో యాత్రకు ఆసక్తి చూపుతారు. అలాగే బస్సులు, ఇతర ప్రైవేట్ వాహనాల్లో ఒక ప్రయాణికుడు శబరికి వెళ్లి వచ్చేందుకు రూ. 5 వేల నుంచి 7వేల వరకు రవాణా ఖర్చు అవుతుంది. రైళ్లలో అయితే కేవలం రూ.2500 తో ప్రయాణం పూర్తవుతోంది. ఈ నేపథ్యంలో రైళ్లకు విపరీతమైన డిమాండ్ పెరిగింది. ప్రతిసారి ఇలాగే కూడా శబరికి వెళ్లే రెగ్యూలర్ రైళ్లలో నాలుగు నెలల క్రితమే రిజర్వేషన్లు భర్తీ అయ్యాయి. భక్తుల రద్దీ దృష్ట్యా రైల్వేశాఖ ప్రకటించిన ప్రత్యేక రైళ్లలోనూ వెయిటింగ్ లిస్టు ఉంటుంది. దీంతో రైలు టికెట్లు దొరక్క, శబరికి ఎలా వెళ్లాలో తెలియక అయ్యప్ప భక్తులు నానా హైరానా పడుతున్నారు. డిమాండ్ కు తగిన విధంగా శబరికి వెళ్లే రైళ్లు అందుబాటులో లేకపోవడం భక్తులు తీవ్ర నిరాశకు గురి అవుతున్నారు. ప్రత్యేక రైళ్లలోనూ రద్దీ డిసెంబర్, జనవరి నెలలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణమధ్య రైల్వే శాఖ ప్రత్యేక రైళ్లను ప్రకటించింది. కానీ ఈ ప్రత్యేక రైళ్లలో హైదరాబాద్, సికింద్రాబాద్ జంటనగరాల నుంచి శబరికి వెళ్లేవి చాల తక్కువగా ఉన్నాయి. ఈ రైళ్లలో కొన్ని ఆదిలాబాద్, నిజామాబాద్, మహబూబ్ నగర్ తదితర ప్రాంతాల నుంచి హైదరాబాద్ మీదుగా శబరికి బయలు దేరుతాయి. దీనివల్ల దూర భారం పెరిగి ప్రయాణం ఆలస్యమవుతుంది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అదనంగా ప్రత్యేక రైళ్లను నడపాల్సిన దక్షిణమధ్య రైల్వే శాఖ అరకొర రైళ్లతో చేతులు దులుపుకుంటుందని అయ్యప్ప స్వాములు ఆరోపిస్తున్నారు. డిసెంబర్ లోనే పరిస్థితి ఇలా ఉంటే జనవరిలో మకరదర్శన నాటికి మరింతగా స్వాముల రద్దీ పెరిగే అవకాశముంది. దీనిని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వేశాఖ రద్దీకనుగుణంగా నగరం నుంచి మరిన్ని ప్రత్యేక రైళ్లను నడుపాలని అయ్యప్పభక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

తత్కాల్ రిజర్వేషన్లలో దళారుల దందా శబరి రైళ్లకున్న డిమాండ్ ను దృష్టిలో ఉంచుకుని తత్కాల్ రిజర్వేషన్లలో దళారుల దందా యధేచ్ఛగా కొనసాగుతోంది. భక్తుల డిమాండ్, అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్ నగరంలోని కొన్ని ట్రావెల్ ఏజెన్సీలు అయ్యప్ప స్వాములు నిలువు దోడిపి చేస్తున్నాయి. కొందరు దళారులు దొడ్డి దారిన టికెట్లు ఇప్పిస్తూ భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారు. రైల్వే శాఖలో తమకున్న పరిచయాలను ఆసరాగా చేసుకుని వీరు రైల్వే టికెట్ల దందాను యదేచ్ఛగా కొనసాగిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.వీరికి రైల్వేశాఖలోని కొంత మంది సిబ్బంది సహకరిస్తున్నట్లు తెలిసింది.

## మోహన్ బాబును తక్షణమే అరెస్ట్ చేయాలి

### ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు బాలవర్ధన్




**పెబ్బేరు, డిసెంబర్ 11 (నిఘా న్యూస్):** జర్నలిస్టుల పట్ల దారుణంగా ప్రవర్తించిన ప్రముఖ సినీ నటుడు మోహన్ బాబును తక్షణమే అరెస్ట్ చేయాలని బుదవారం పెబ్బేరు ప్రెస్ క్లబ్ అధ్యక్షులు జి బాలవర్ధన్ డిమాండ్ చేశారు. సినీ హీరో నిర్మాత మోహన్ బాబు ఒక ప్రముఖ టివి ఛానల్ జర్నలిస్ట్ రంజిత్ పై అకారణంగా దాడి చేయడంపై నిరసిస్తూ ప్రెస్ క్లబ్ కార్యాలయంలో అధ్యక్షుడు బాలవర్ధన్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు తీవంగా ఖండించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు బాలవర్ధన్ మాట్లాడుతూ మోహన్ బాబు ఇంటి వద్ద న్యూస్ కవర్ చేయడానికి వచ్చిన మీడియా ప్రతినిధులపై దాడి మీకున్న అహంకారానికి మీ దిగజారుడుతనానికి నిదర్శనమని అన్నారు. తక్షణమే మోహన్ బాబుపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని, జర్నలిస్టుల పై దాడికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.పోలీసులు సమక్షంలో దాడి జరగడం జర్నలిస్టుల భద్రతకు భరోసా లేదని మరొకసారి రుజువు అయిందని దీనిపై ప్రభుత్వ పెద్దలు స్పందించి దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విలేకరులు రమేష్, శ్రీనివాసులు,రవీందర్ గౌడ్, కెఎం బాష, విజయ్, పరష రాములు,బాలరాజు,మందడి చిరంజీవి,అతీఖ్ పాషా, రాజేంద్రప్రసాద్, గోపి,ఉమా శంకర్, శ్రీకాంత్, రాజేష్, అశోక్, రమేష్, మన్యం, రవి, కుమార స్వామి, తోకల మహేష్,శంకర్,ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## హమాలిలకు గుర్తింపు లైసెన్సులు అందజేత






- గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ ని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం
- మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి

**అబ్దుల్లాపూర్ మెట్, డిసెంబర్ 11 (నిఘా న్యూస్):** గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుర రెడ్డి అన్నారు. బుధవారం బాటసింగారం పండ్ల మార్కెట్ కార్యాలయంలో చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి అధ్యక్షతన 2వ పాలకవర్గం సాధారణ సమావేశం నిర్వహించి పలు తీర్మానాలను ఆమోదించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నదే పాలకవర్గం ఉద్దేశమని మార్కెట్ ని అందరి సహకారంతో అభివృద్ధి పదంలో నడిపిస్తామని అన్నారు. మార్కెట్ పరిధిలోకి వచ్చే రైతు బజార్లను ఎన్టీఆర్ నగర్ మార్కెట్ లను ఎప్పటికప్పుడు తనిఖీ చేసి సమస్యలు లేకుండా చూస్తామని తెలిపారు. ఎంతో కాలం నుండి పెండింగ్ లో గుర్తింపు లైసెన్స్ లను హమాలీలకు అందరికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ సిహెచ్.బాస్కర చారి, డైరక్టర్లు మచ్చేందర్ రెడ్డి, అంజయ్య మేకం లక్ష్మి రఘుపతి రెడ్డి, గణేష్ నాయక్, నరసింహ నవరాజ్, గోవర్ధన్ రెడ్డి వెంకట్ గుప్తా ఇబ్రహీంతో పాటు మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి శ్రీనివాస్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## రాచమల్లు అక్రమాలపై ఫిర్యాదు చేయండి



### దరఖాస్తుదారులకు పద్ధతి కల్పించి సమస్యలు పరిష్కరిస్తాం

**ప్రొద్దుటూరు, డిసెంబర్ 11 (నిఘా న్యూస్):** ప్రజలు అక్రమాలకు గురైనట్లు తెలిపితే ఎంతటి నాయకు నైనా ఉపేక్షించేది లేదని టిడిపి నాయకులు ఇవి సుధాకర్ రెడ్డి కామిశెట్టి బాబు తలారి పుల్లయ్య నల్లబోతుల నాగరాజు తెలిపారు. స్థానిక నెహ్రూ రోడ్డులోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత వైసిపి హయాంలో జరిగిన అక్రమాలపై తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల నుండి వినతులు స్వీకరించిన నేపథ్యంలో అధికంగా భూ సమస్యలే ప్రజల నుండి వెల్లు వెత్తాయని దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిష్టాత్మకంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించి ప్రజల నుండి వెళితులు స్వీకరించి వాటిని పరిష్కరించే కార్యక్రమం చేపట్టారని వివరించారు. ఈ క్రమంలో మండలంలోని దోరసానిపల్లి గ్రామ పంచాయతీలో జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత పాల్గొని సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి గత ప్రభుత్వంలో జరిగిన భూ దందాలు అసాంఘిక కార్యక్రమాలపై ప్రస్తావిస్తే మాజీ ఎమ్మెల్యే రాచమల్లు గుమ్మడికాయ దొంగలు అంటే భుజాలు తడుముకున్న సందర్భంగా తననె అన్నట్లు భావించడం సరికాదన్నారు. వారి ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే సోదరుడు రాచమల్లు కిరణ్ కుమార్ రెడ్డి చౌటపల్లి చర్చి భూములు వేచిన విషయం నిజం కాదా అని ప్రశ్నించారు. జగనన్న కాలనీలు ఏర్పాటు చేసిన స్థలాలను వారి కుటుంబ సభ్యులు తక్కువ ధరకు కొని ప్రభుత్వాన్ని ఎక్కువ ధరకు విక్రయించిన మాట నిజం కాదా అన్నారు గత ఐదు సంవత్సరాల పాలనలో ఖజానా ఖాళీ చేశారని కేవలం అప్పులు మాత్రమే మిగిలాయన్నారు. దీనివల్లనే సంక్షేమ పథకాల అమలు ఆలస్యం జరుగుతుందని వివరించారు. గత ఐదు సంవత్సరాలలో హైకోర్టు కర్నూలులో ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. ప్రజలు ముందుకు వచ్చి రాచమల్లు అక్రమాలపై తెలిపితే అతనిపై విచారణ జరిపిస్తామని వివరించారు.

## ముమ్మరంగా స్మార్ట్ మీటర్ల బిగింపు



**బెల్లంకొండ, డిసెంబర్ 11 (నిఘా న్యూస్):** మండల కేంద్రంలో స్మార్ట్ మీటర్ల బిగింపు కార్యక్రమం శరవేగంగా జరుగుతుంది. ముందుగా ప్రభుత్వ కార్యాలయాలకు బిగించగా ఆ తర్వాత మరికొన్ని త్రీ ఫేస్ విద్యుత్ మోటర్ లకు మీటర్ల బిగించారు. ప్రస్తుతం క్యాటగిరి-2 లకు ఇన్ స్టాలర్లు బిగిస్తున్నారు. దీని లక్ష్యం విద్యుత్ వృధాను తగ్గిస్తూ నాణ్యమైన సేవలను అందించేందుకు ప్రభుత్వం నడుం బిగించింది. అందులో భాగంగానే స్మార్ట్ మీటర్ లను బిగిస్తుంది. ప్రీపెయిడ్ మీటర్లు గా పనిచేసే వీటి ద్వారా విద్యుత్ ఆద కావడంతో పాటు విద్యుత్ చౌర్యం పూర్తిగా నిర్మూలనకు అవకాశం ఉంటుంది. అంతేకాకుండా బిల్లులు బకాయిలు పడకుండా ఉంటుంది. మొబైల్ కు రీఛార్జ్ చేసిన విధంగానే ఈ స్మార్ట్ విద్యుత్ మీటర్లను రీఛార్జ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ రీచార్జ్ చేసిన డబ్బులు అయిపోగానే విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. ఇప్పటివరకు రీడింగ్ తీసే వ్యక్తి మీటర్ల వద్దకు వచ్చి ప్రింటింగ్ బిల్లు ఇచ్చేవారు. ఒక్క నెల ఆలస్యంగా రీడింగ్ నమోదు చేయడంతో బిల్లు ఎక్కువగా రావడం యజమాని ఇంట్లో లేకపోవడంతో సకాలంలో బిల్లు అందకపోవడం అనే సమస్యలు వచ్చేవి.స్మార్ట్ మీటర్లతో ఇక బకాయిల భారం ఉండదు. మండల వ్యాప్తంగా వ్యవసాయానికి విద్యుత్ కనెక్షన్లు 2845 క్యాటగిరి-2 కనెక్షన్లు 500 క్యాటగిరి-1 కనెక్షన్లు7,800 ఉన్నట్లు బెల్లంకొండ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తెలిపారు.

## భద్రకాళి ఆలయాన్ని సందర్శించిన మిలింద్ పరందే



**వరంగల్, డిసెంబర్ 11 (నిఘా న్యూస్):** వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానాన్ని విశ్వహిందూ పరిషత్ ఇంటర్నేషనల్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ మిలింద్ పరందే సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన మిలింద్ పరందేకి ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభం, మంగళవాద్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా ఆదిశంకరాచార్యులను, వల్లభ గణపతిని దర్శించిన అనంతరం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. పూజానంతరం ఆలయ మహా మండపంలో అర్చకులు, వేదపండితులు మహదాశీర్వచనం నిర్వహించి దేవాలయ స్థలపురాణం వివరించి అమ్మవారి శేషవస్త్రాలు బహూకరించి ప్రసాదములు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ వరంగల్ జోన్ డిప్యూటీ కమీషనర్ టి. శ్రీకాంతా రావు, దేవాలయ పర్యవేక్షకులు అద్దంకి విజయ్ కుమార్, విశ్వహిందూ పరిషత్ తెలంగాణా ప్రాంత అధ్యక్షులు ఓజనపల్లి నర్సింహులు, వైస్ ప్రసిడెంట్ న్యాలకొండ భాస్కర్ రావు, స్టేట్ సెక్రెటరీ పరాయితం లక్ష్మీనారాయణ, క్షేత్ర సంఘటన మంత్రి గుముల సత్యం, భజరంగ్ దళ్ స్టేట్ ప్రెసిడెంట్ శివరాములు, వరంగల్ విభాగ్ అధ్యక్షులు శ్రీరాం ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ దీక్ష వల్లే తెలంగాణ ప్రకటన

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏనాడు జై తెలంగాణ అనలేదు
- సంగమేశ్వర బసవేశ్వర్ ప్రాజెక్టు పనులు చేపట్టాలి
- దేశ వ్యాప్తంగా 32 రాజకీయ పార్టీల ఏకం చేసిన కేసీఆర్
- సిద్ధిపేట ఎమ్మెల్యే మాజీ మంత్రి హరీష్ రావు

**సంగారెడ్డి, డిసెంబర్ 11 (నిఘా న్యూస్):** రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతుందని, నేడు దయ్యాలు వేదాలు వల్లిస్తున్నాయని సిద్దిపేట ఎమ్మెల్యే మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వంద ఎలుకలు తిన్న రాబందు తీర్థయాత్రలకు పోయినట్లు, దయ్యాలు వేదాలు వల్లించినట్లు రేవంత్ రెడ్డి వైఖరి ఉందిని పేర్కొన్నారు. ఏ రోజు జై తెలంగాణ అనలేదని, ఉద్యమసమయంలో రాజీనామా చేయమంటే పరిపోయిన ఆసమర్తుడు రేవంత్ రెడ్డి తెలిపారు. కనీసం, అమరవీరులకు పువ్వులు పెట్టి నివాళులు అర్పించలేదనీ పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఏనాడూ పాల్గొన్న వ్యక్తి కాదన్నారు. డిసెంబర్ 9 తెలంగాణ ప్రకటన కేసీఆర్ ఆమరణ దీక్ష ఫలితమేనన్నారు. ఎవరో దయ వల్ల తెలంగాణ వచ్చింది అనడం ఉద్యమ కారులను, తెలంగాణ వారిని అవమానించడమేనన్నారు. తెలంగాణకు అడుగడుగునా అడ్డు పడ్డది కాంగ్రెస్ పార్టీ. కాంగ్రెస్ ది ద్రోహు ల చరిత్రకలిగిన పార్టీ తెలిపారు. ఆనాడు ఆంధ్ర లాబియింగ్ కు తలొగ్గి ఉన్న తెలంగాణను ఆంధ్రలో కలిపిందే కాంగ్రెస్ వల్లే నన్నారు. ఫజల్ అలీ కమిషన్ సఫిర్సులను తుంగలో తొక్కింది నెహ్రూ. 1969 ఉద్యమాన్ని ఇనుప కాళ్లతో తొక్కించ్చి 369 మంది ఉద్యమకారులను పొట్టన పెట్టుకున్న పార్టీ కాంగ్రెస్ పేర్కొన్నారు. ఇందిరమ్మ రాజ్యం కూడా కాంగ్రెస్ తెలంగాణ ఏర్పాటు వ్యతిరేకమేనన్నారు. అసెంబ్లీ ముందు అమరవీరుల స్థూపం నేటికీ సాక్ష్యాలుగా ఉన్నాయన్నారు. తెలంగాణ ప్రజా సమితిని కాంగ్రెస్ లో కలుపుకొని ప్రజల ఆకాంక్షను కాలరాసారన్నారు. 2001లో కేసీఆర్ పార్టీ పెట్టకుంటే, పోరాటం చేయకుంటే అసలు తెలంగాణ మాటే లేదు అసెంబ్లీలో తెలంగాణ పదం నిషేధించారన్నారు. నాటి పాలకులు తెలంగాణ బదులు వెనుకబడ్డ ప్రాంతం అనాలని హుకుం జారీ చేసారని తెలిపారు. 66 ఏండ్ల టీడీపీ, కాంగ్రెస్ పాలనలో జై తెలంగాణ అంటే పాపం. అలాంటి సమయంలో కేసీఆర్ పార్టీ పెట్టారు, ఉద్యమాన్ని ముందుండి నిడిపించారు. 2004లో హామి ఇస్తే కేంద్ర క్యాబినెట్ లో చేరారని తెలంగాణ ఇవ్వక పోగా టీఆర్ఎస్ ఎమ్మెల్యేలను చేర్చుకునే ప్రయత్నం చేసారన్నారు. ఉద్యమాన్ని కాలరాసే ప్రయత్నం కాంగ్రెస్ పార్టీ చేసిందని తెలిపారు. కేంద్రంలో మంత్రిగా ఉండి ఆర్ఎస్ఎస్ ఆర్ఎస్ యూ వరకు అనేక సంఘాలు ఆఫీసు చుట్టూ కేసీఆర్ తిరిగారను తెలిపారు. దేశంలో 32 రాజకీయ పార్టీలను ఒప్పించి మెప్పించి ప్రణబ్ ముఖర్జీ ను లేఖ ఇచ్చింది కేసీఆర్ ఇది చరిత్రలో ఉన్న వాస్తవమన్నారు. ఆ సమయంలో ఇక్కడ వైయస్ తెలంగాణ ఇవ్వడానికి సిగరెట్టా, బీడా అని హేళన మాటలు మాట్లాడిన మాటలు ప్రజలు మరువలేదని అన్నారు. హైదరాబాద్ పోవాలంటే పాస్ పోర్టు వీసా కావాలె వ్యతిరేక విధానాలు అవలంబించారని తెలిపారు. అయినా కేసీఆర్ తెలంగాణ కోసం నిరంతరం శ్రమించారన్నారు. అయినా కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ఇవ్వలేదు. చివరకు కేసీఆర్ కేంద్ర మంత్రి పదవికి, ఎంపీ పదవికి రాజీనామ చేసి ఉద్యమానికి శ్రీకారం చుట్టారన్నారు. తెలంగాణ ఇవ్వకుండా మోసం చేసిన పార్టీ కాంగ్రెస్ 1200 వందల మంది



విద్యార్థుల ఆత్మబలిదానాలకు కారణం కాంగ్రెస్ పార్టీ పేర్కొన్నారు. ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణ ఇచ్చి ఉంటే అంతమంది చనిపోయేవారా కాంగ్రెస్ పార్టీ నిలదీశారు. కేసీఆర్ అయితే నా శవ యాత్ర, లేదంటే జైత్ర యాత్ర అని, తెలంగాణ వచ్చుడో కేసీఆర్ సచ్చుడో అని కేసీఆర్ ఉద్యమానికిఆమరణ దీక్షకు కూర్చొంటే ఖమ్మం తరలించారన్నారు. ఖమ్మం జైల్లో పెట్టి ఉద్యమాన్ని అణిచివేసే కుట్ర చేసింది కాంగ్రెస్ పార్టీ కాదా ప్రశ్నించారు. డిసెంబర్ 9 ప్రకటన కేసీఆర్ పోరాట ఫలితం కాదా? గుర్తు చేశారు. చిదంబరం జయశంకర్ ను ఫోన్ చేసి జయశంకర్ కేసీఆర్ రాసి ఇచ్చిందే చిదంబరం చదివారున్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ ప్రారంభం అయిందని ప్రకటించారు. నవంబర్ 29 లేకుంటే, డిసెంబర్ 9 లేదు, ఇవి లేకుంటే జూన్ 2 తెలంగాణ ఏర్పాటు లేదు కాంగ్రెస్, టీడీపీ ఎమ్మెల్యేలు రాజీనామాలు చేయలేదని ఆవేదనతో ఎంతో మంది ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. చంద్రబాబును ఎవరు నిలదీస్తున్నరు అని రైఫిల్ పట్టుకొని ఉద్యమ కారుల మీదికి వెళ్లింది ఈ రేవంత్ రైఫిల్ రెడ్డి పేర్కొన్నారు. 2004లో తెలంగాణ ఇచ్చి ఉంటే ఒక్క బిడ్డ ప్రాణం పోయి ఉండేది కాదన్నారు. 15 ఏండ్ల క్రింద చిదంబరం ప్రకటన వచ్చిందంటే అది కేసీఆర్ దీక్షాఫలమే నన్నారు. కేసీఆర్, కృషి వల్ల రాష్ట సాదన ప్రకటన వస్తె సోనియా గాంధీ దయతలచి ఇచ్చిందని కాంగ్రెస్ అంటుందని తెలిపారు. సోనియా దయతలచి ఇవ్వాలేదనీ, కేసీఆర్ పోరాటం చేస్తే తప్పని పరిస్థితిలో తెలంగాణ ఇచ్చిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు స్థానిక ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, నాయకులు పట్నం మాణిక్యం డాక్టర్ శ్రీహరి, కొండల్ రెడ్డి ఇంద్ర రెడ్డి లక్ష్మరెడ్డి, మనోహర్ గౌడ్ విజేందర్ రెడ్డి అర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## మీడియా జర్నలిస్టులపై దాడులు తగదు

### దాడిని తీవ్రంగా ఖండించిన జర్నలిస్టులు

### తహసిల్దార్ కార్యాలయం ముందు నిరసన




**మద్దూర్, డిసెంబర్ 11 (నిఘా న్యూస్):** మండల కేంద్రం లోని తహసీల్దార్ కార్యాలయం ముందు బుధవారం మీడియా జర్నలిస్టులు నిరసన చేపట్టారు. రిపోర్టర్ రంజిత్ పై దాడి చేసిన వ్యక్తులపై చర్య తీసుకోవాలని మండల జర్నలిస్టులు తహసిల్దార్ మహేష్ గౌడ్ కు వినతి పత్రం అందజేశారు. హైదరాబాదులో మంగళవారం సినిమా హీరో మోహన్ బాబు వారి అనుచరులు రిపోర్టర్ రంజిత్ పై దాడి చేయడం సరైన విధానం కాదని తీవ్రంగా ఖండించారు. మీడియా జర్నలిస్టుల పై దాడిని ఖండిస్తూ, దాడికి పాల్పడిన సినిమా హీరో మోహన్ బాబు, వారి అనుచరులపై చట్టరిత్యా చర్య తీసుకోవాలని, వెంటనే తెలంగాణ రాష్ట్ర జర్నలిస్టులకు క్షమాపణ చెప్పాలని మండల పత్రిక, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల జర్నలిస్టులు అంజయ్య, షబ్బీర్ నారాయణ రెడ్డి, విజయ్ కుమార్, పవన్ కుమార్ రెడ్డి, కంరోద్దీన్, కేశవ్ యాదవ్, బి ఆర్ యస్ పార్టీ మండల అధ్యక్షుడు వంచర్ల గోపాల్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా లిటిల్ ఫ్లవర్ స్కూల్ వార్షికోత్సవం







**ఉప్పల్, డిసెంబర్ 11 (నిఘా న్యూస్):** ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ స్కూల్ లో ఘనంగా వార్షికోత్సవ వేడుకలు కన్నుల పండుగ గా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్వే ఆఫ్ ఇండియా ఎన్ఐజిఎస్టి జనరల్ డాక్టర్ ఎం.కె.స్టాలిన్ హాజరైనారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి స్టాలిన్ మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి వెలికి తీసి ప్రోత్సహించడం వల్ల వారు అన్ని రంగాలలో అభివృద్ధి సాధించగలరని తద్వారా దేశం ఉజ్వల బాటలో పయనించి పురోగతి సాధిస్తుందని ఉద్ఘాటించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. వివిధ పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రదానం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా డాక్టర్.ఎస్.మోహన ప్రియ (ఐఏఎస్ అసిస్టెంట్ కలెక్టర్ పలక్కాడ్ కేరళ) ఇందిరాగాంధీ (ఇండియన్ రైల్వే ఇంజనీర్) విచ్చేశారు. గౌరవ అతిథులుగా జమాలుద్దీన్, జి.రామకృష్ణ నాయుడు హాజరైనారు. ఈ కార్యక్రమంలో కరెస్పాండెంట్ రెవరెండ్ బ్రదర్ అరుణ్ ప్రకాష్, ప్రిన్సిపల్ రెవరెండ్ బ్రదర్ జోసఫ్, డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ రెవరెండ్ బ్రదర్ జాన్ కలరెకల్ ఫైనాన్షియల్ అడ్మినిస్ట్రేటర్ రెవరెండ్ బ్రదర్ ఎంఏ.జార్జ్ తదితరులు పాల్గొన్నారు.

# మంచు మోహన్ బాబుపై చర్యలకు ఫిర్యాదు

### వేములవాడ ప్రెస్ క్లబ్ పాత్రికేయుల నిరసన

**వేములవాడ, డిసెంబర్ 11 (నిఘా న్యూస్):** సినీ నటుడు మంచు మొహన్ బాబు ఇంటికి వార్త కావారేజీకి వెళ్లిన జర్నలిస్టులపై దాడిని ఖండిస్తూ వేములవాడ ప్రెస్ క్లబ్ టి,యు డబ్ల్యూ జె ఐ జే యు ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ప్రెస్ క్లబ్ నుండి తహసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి తహసిల్దార్ మహేష్ కుమార్ కు వినతి పత్రం అందజేశారు. సినీనటుడు మోహన్ బాబు కుటుంబాల తగాదాల వల్ల మీడియా కవరేజ్ కు వెళ్ళిన పాత్రికేయులపై దాడులు చేయడం సిగ్గుచేటు అన్నారు. మోహన్ బాబును అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పుట్టపాక లక్ష్మణ్, ఉపాధ్యక్షులు తాళ్లపల్లి ప్రశాంత్, ప్రధాన కార్యదర్శి నూగురి మహేష్, సంయుక్త కార్యదర్శి దూలం సంపత్, మాజీ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు హింగే శ్రీనివాస్, ప్రెస్ క్లబ్ సభ్యులు మ్యాన శ్రీనివాస్,బుజ్జన్న, పంపరి శంకర్, పారువెల్లి శ్రీనివాస్, కలీం పాష,సాయిబాబా,తూప్ కారీ శ్రీనివాస్,పరశురాములు,



జిల్లా దాడుల నివారణ కమిటీ కన్వీనర్ కొక్కుల శ్రీనివాస్, బావండ్ల బాబు,ఎం ఏ మన్నాన్, జోగ్రిగల రవీందర్, ప్రెస్ క్లబ్ సభ్యులు ఉన్నారు.

# సీఎం కప్ క్రీడల్లో పత్తిపాక విద్యార్థుల ప్రతిభ

**వరంగల్, డిసెంబర్ 11 (నిఘా న్యూస్):** వరంగల్ ఉమ్మడి జిల్లాలో 10 11 తేదీలలో శాయంపేట మండల కేంద్రం జూనియర్ కాలేజీ గ్రౌండ్ లో సీఎం కప్ 2024 ఛాంపియన్ షిప్ పోటీలలో పత్తిపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అత్యున్నత ప్రతిభ చూపి యోగా పోటీలలో మండల ఛాంపియన్ గెలుచుకొని జిల్లా స్థాయికి ఎంపిక అయ్యారు స్థానిక ఎంపీడీవో ఫణి చందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో స్థానిక మండల పాఠశాల విద్యార్థులు యువజనలు కబడ్డీ కోకో అథ్లెటిక్స్ యోగా పోటీలు అత్యంత వైభవంగా ప్రారంభమైనవి ఈ ప్రారంభ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. యోగా పోటీలలో పత్తిపాక విద్యార్థులు జి నవదీప్ సాయి ప్రణయ్ సాల్మన్ జీ వరుణ్ ఎస్ వరుణ్ మండల స్థాయి పోటీలలో ఛాంపియన్ గా నిలబడి జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక కావడం జరిగింది. ఈ విజయానికి కారణమైన పాఠశాల పి ఈ టి బొలిశెట్టి కమలాకర్ ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి మాధవి అభినందించారుద. ఉపాధ్యాయులు రఘు సోంబాబు విజయ్ అనిత విజయ కిరణ్మయి అభినందించారు పిఎస్ హెచ్ఎం శ్రీనివాసు పాఠశాల కాంప్లెక్స్ అన్ని రంగాలలో దూసుకు పోతున్నందుకు ప్రత్యేకంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎంఈఓ బిక్షపతి గ్రామ కార్యదర్శి రాజారాం తదితరులు పాల్గొన్నారు.




## బీజేపీ సభ్యత్వ నమోదులో మౌలాలి ముందుంది



**మల్కాజిగిరి, డిసెంబర్ 11 (నిఘా న్యూస్):** బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం మల్కాజిగిరి సర్కిల్ మౌలాలి డివిజన్ లో విస్తృతంగా జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా నాయకులు డివిజన్ పర్యవేక్షకులు కాటేపల్లి రవీందర్ రెడ్డి, డివిజన్ బిజెపి అధ్యక్షులు సాయిబాబు తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డివిజన్ లో బిజెపి సభ్యత్వ వివరాలను తెలుసుకున్నారు. సభ్యత్వాల విషయంలో జిల్లా పార్టీ ఆదేనుసారం వారికి మార్గదర్శనం చేశారు. మౌలాలి లో చేసిన క్రియాశీల సభ్యత్వాలను, బూత్ కమిటీ ల పట్టికలను తీసుకున్నారు. 50 బూత్ కమిటీలకు గాను 39 బూత్ కమిటీల లిస్టులను ఈ సందర్భంగా సేకరించి 35 క్రియాశీల సభ్యత్వాలను తీసుకున్నారు. రెండు రోజులలో మిగతా 15 సభ్యత్వాలను, బూత్ కమిటీను తప్పని సరిగా చేయాలని సూచించారు. బిజెపి నాయకులను సంప్రదిస్తూ సాధారణ సభ్యత్వం, క్రియాశీల సభ్యత్వాల కోసం, రవీందర్ రెడ్డి తో కలసి సంప్రదిస్తూ పని చేశానని ఈ సందర్భంగా సాయి బాబా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ బిజేపి సీనియర్ నాయకులు చంద్రమౌళి. ఉన్నారు.

# అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### షీ టీం పని తీరు పై విద్యార్థులకు అవగాహన




**నారాయణపేట, డిసెంబర్ 11 (నిఘా న్యూస్):** మహిళలు, విద్యార్థులు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని షీ టీం పోలీసులు తెలిపారు. అపరిచిత వ్యక్తుల పట్ల ఎలాంటి ఇబ్బందులు ఏర్పడిన టి సేఫ్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చని షీ టీం పోలీసులు బాలరాజు, చెన్నయ్య తెలిపారు. బుధవారం మక్తల్ మండలం, జక్లేర్ గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు పలు సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతిరోజు స్కూలు, కళాశాలకు వచ్చే విద్యార్థులు, మహిళలు టీ సేఫ్ యాప్ ను డౌన్లోడ్ చేసుకుని ప్రయాణం చేసే సమయంలో తప్పక ఉపయోగించుకోవాలని తెలిపారు. మహిళలు, బాలికలు ఎక్కువగా తెలిసిన వారితోనే వేధింపులకు గురవుతున్నారని అలాంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని, ధైర్యంగా ఉండి షి టీమ్ పోలీసులకు సెల్ 8712670398 కి లేదా డయల్ 100 కి సమాచారం ఇవ్వాలని ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచి ఆకతాయిల ఆట కట్టించి సమస్యను పరిష్కరించడం జరుగుతుందని పోలీసులు సూచించారు. అలాగే విద్యార్థులు సెల్ఫోన్ వినియోగానికి దూరంగా ఉండాలని సెల్ ఫోన్ ఉపయోగించడం వల్ల సమయం వృధా తప్ప ఎలాంటి ప్రయోజనం ఉండదని సెల్ఫోన్లో తమ ఫోటోలను అప్లోడ్ చేస్తే వాటిని అదునుగా చూసుకుని సైబర్ నేరగాళ్లు డిపి లను అశ్లీలంగా తయారు చేసి మోసం చేస్తారని కావున అలాంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు చదువుపై దృష్టి సాధించాలని కోరారు. విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సైబర్ నేరగాళ్లు అనేక రకాలుగా మోసాలు చేస్తున్నారని అలాంటి మోసాలకు గురికాకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

# బసవన్నపై వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యేను బర్తరఫ్ చేయాలి

### వీరశైవ లింగాయత్ సమాజం అధ్యక్షుడు జయప్రకాష్ డిమాండ్



**సంగారెడ్డి, డిసెంబర్ 11 (నిఘా న్యూస్):** విశ్వగురు మహాత్మ బసవేశ్వరునిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కర్ణాటక బీజాపూర్ ఎమ్మెల్యే బసవన్న గౌడను తక్షణమే బర్త్ రఫ్ చేయాలని సదాశివపేట వీరశైవ లింగాయత్ సమాజం కార్యనిర్వహక అధ్యక్షుడు అన్మిశెట్టి జయప్రకాష్ డిమాండ్ చేశారు. ఓ సమావేశంలో బసవన్న గౌడ మాట్లాడుతూ, "బసవేశ్వరుడు నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని" వ్యాఖ్యానించడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. మహాత్మ బసవేశ్వరుడు 12వ శతాబ్దంలో సమ సమాజ స్థాపనకై కృషి చేసిన మహోన్నత వ్యక్తి. కుల, మతాలకు అతీతంగా సమానత్వానికి ప్రాధాన్యం ఇచ్చిన బసవేశ్వరుని విమర్శించడం తగదని ఆయన అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్యే బసవన్న గౌడ పేరులోని "బసవన్న" పేరు మార్చుకోవాలని, అతనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ వ్యాఖ్యలపై తెలంగాణ వీరశైవ లింగాయత సమాజం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, రాబోయే రోజుల్లో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# రాజన్న కోడెలు అమ్ముకున్న కేసులో ముగ్గురి అరెస్ట్



**నర్సంపేట, డిసెంబర్ 11 (నిఘా న్యూస్):** నిఘా న్యూస్ డిసెంబర్ రాజరాజేశ్వర స్వామి కోడెలను రైతుల పేరిట తీసుకువచ్చి అమ్ముకున్న ముగ్గురిని వరంగల్ జిల్లా గీసుకొండ పోలీసులు మంగళవారం రాత్రి అరెస్ట్ చేశారు. గీసుకొండ సిఐ మహేందర్ కథనం ప్రకారం శ్రీ రాజరాజేశ్వర సొసైటీ పేరిట గోశాల నడుపుతున్న వెలగందుల రాజు కాంగ్రెస్ నాయకులు మాదాసి రాంబాబు ఈనెల ఒకటిన వేముల దేవస్థానం నుంచి లేగ దూడలు తీసుకొని వచ్చి కబేళాలకు తరలిస్తున్నారని వారిపై విశ్వహిందూ పరిషత్ పాటు పలువురు గీసుకొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు విచారణ చేపట్టారు అతనితో పాటు అనంతారం గ్రామానికి చెందిన మందస్వామి దొంగోడి మండలం చలపర్తి చెందిన పశునుటి శ్యాంసుందర్ కలిసి వారి కుటుంబ సభ్యులతో పాటు గీసుకొండ దుగ్గోడి మండలంలో తెలిసిన రైతుల నుంచి ఆధార్ కార్డులు భూమి పత్రాలు సేకరించారు. అనంతరం వేములవాడ గోశాలకు వెళ్లి అక్కడి దేవాలయ అధికారుల సహకారంతో రైతుల ఫోర్జరీ సంతకాలు పెట్టారు. రెండో విడతలు 66 కోడెలను గీసుకొండ మండలం గట్టు కిందపల్లి లోని మాదశి రాంబాబు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్న భూమి పక్కన ఉన్న ఖాళీ స్థలంలోకి తరలించారు. వాటిలో 28 కోడెలను అమ్ముకోగా మరో 26 కోడెలు వేములవాడ గోశాలకు తిరిగి అప్పగించారు అలాగే మూడు కోడలు చనిపోగా మిగిలిన మరో 9 కోడెలు స్వాధీనం చేసుకున్నామని దీనికి బాధ్యులైన ముగ్గురిని అరెస్టు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.



# కీసర శివారులో వ్యక్తి మృతి

### కీసర సిఐ వెంకటయ్య

**కీసర,డిసెంబర్ 11 (నిఘా న్యూస్):** కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో హరిదాసుపల్లి గ్రామం శివారులో హరిదాసుపల్లి గ్రామం నుండి దమ్మాయిగూడ వైపు వెళ్ళు రోడ్డు ప్రక్కన ఒక వ్యక్తి మరణించాడని సంచారం రావడంతో అక్కడికి వెళ్ళి చూడగా ఒక వ్యక్తి రక్తపు మడుగులో చనిపోయి ఉన్నాడు. మృతుడి వివరాలు తెలుసుకోగా అతని పేరు మహిపాల్, మహేష్ తండ్రి కనకయ్య, కాప్రా పరిధిలోని ఎల్లారెడ్డిగూడ నివాసి అని గుర్తించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కీసర పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం జరుగుతున్నదని కీసర పోలీస్ స్టేషన్ సిఐ వెంకటయ్య తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాలలో.. బైబిల్ పంపిణీ

- క్రిస్మస్ గిఫ్ట్ పేరుతో విద్యార్థులకు పంచిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు
- మత ప్రచారకుడా లేక ఉపాధ్యాయుడా ప్రశ్నించిన ఏబీవీపీ
- వెంటనే సస్పెండ్ చేయాలని డిఇఓ కు ఫిర్యాదు






**రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 11 (నిఘా న్యూస్):** ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్ కుమార్ మాట్లాడుతూ మత ప్రచారం చేస్తున్న రాజు టీచర్ ను వెంటనే సస్పెండ్ చేయాలి. లేకుంటే డిఈఓ కార్యలయం ముట్టడిస్తాం గతంలో ఈ ఉపాధ్యాయుడు అనేక మత మార్పిడిలు చేశారు. ఇతని పైన కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపురం ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయనిగా పనిచేస్తున్న లింగాల రాజు అనే ఉపాధ్యాయుడు క్రిస్మస్ గిఫ్ట్ పేరుతో సుమారు 100మంది విద్యార్థులకు బైబిల్లను పదిన్నర గంటల ప్రాంతంలో పంపిణీ చేశారు. ఈ విషయాన్ని పాఠశాల విద్యార్థులు ఏబీవీపీ నాయకులకు ఫిర్యాదు చేయగా నారాయణపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చేరుకొని లింగాల రాజు అనే ఉపాధ్యాయుడు పంచిన బైబిల్లను విద్యార్థుల నుండి స్వాధీనం చేసుకున్నారు.

పాఠశాల ఉపాధ్యాయ గదిలో ఉన్న మరో బైబిల్ల ప్యాకింగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. ద్యాధికారి శ్రీహరికి ఫిర్యాదు చేశారు. పంపిణీకి సంబంధించి వీడియోలు తీసిన చిత్రీకరణను ఎంఈఓకు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలో వందమంది విద్యార్థులకు క్రిస్మస్ గిఫ్టల పేరుతో బైబిల్లను పంచిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు లింగాల రాజపై వెంటనే విచారణ జరిపి సస్పెండ్ చేయాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు.

# జవహర్ నగర్ మొత్తం అనధికార నిర్మాణాలే..!

- ఏ బహుళ అంతస్తుల ఫోటోనైనా వేసి రాసుకోండని వ్యంగం
- మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి
- అనధికార నిర్మాణాల జాబితాను మీకెందుకు ఇవ్వాలి
- జవహర్ నగర్ టిపిఓ స్రవంతి



**జవహర్‌నగర్, డిసెంబర్ 11 (నిఘా న్యూస్):** జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని దిన దిన అభివృద్ధి చెందుతున్న అక్రమ నిర్మాణాలు అనే ప్రధాన అంశంతో డిసెంబర్ 10కమిషనర్ వివరణ కోరుతూ నిఘా న్యూస్‌లో ప్రచురితమైంది. ఈ అంశంపై అనధికార బహుళ అంతస్తులు అక్రమ నిర్మాణాల ఎన్ని గుర్తించి కలెక్టర్ ఆధ్వర్యంలో ఉండే డిటిఎఫ్ కు అక్రమ నిర్మాణాల జాబితాను పంపారని నిఘా ప్రతినిధి అడుగగా కమిషనర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మీరు జవహర్ నగర్ లో ఏ నిర్మాణం అయిన ఫోటో తీసి వేసి రాసుకోండి. జవహర్ నగర్ మొత్తం అక్రమ నిర్మాణాలే, ఒక వ్యాసం రాసుకోండి. అన్నిట్లో ఇదొకటి పడి ఉంటుంది. అనినిర్లక్ష్యంగా, బాధ్యతారాహితంగా నిర్లక్ష్య ధోరణిలో సమాధానం ఇవ్వడం జరిగింది. ఇదే అంశంపై జవహర్ నగర్(టిపిఓ) టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ స్రవంతి వివరణ కోరగా అనధికార నిర్మాణం జాబితా నీకెందుకు ఇవ్వాలి. దినదిన అభివృద్ధి చెందుతున్న అక్రమ నిర్మాణాలను అనివార్త రాశారు కదా, రాసుకోండి. అంటూనే ఇలా రాయడం కాదు పర్మిషన్ల కోసం రాయండని హితవు పలికారు. నోటీస్ ఇచ్చామని చెప్పగా, నిఘా ప్రతినిధి నోటీసులు ఇచ్చిన గాని అక్రమ నిర్మాణాలు ఆగటం లేదు కదా అడగగా చూస్తాం చేస్తాం అని నిర్లక్ష్య ధోరణిలో సమాధానం ఇచ్చారు. జవహర్ నగర్ భావి భారత పౌరుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టి వేస్తున్నట్లుగా అధికారులు సమాధానం ఇవ్వడం జవహర్ నగర్‌లో విడ్డూరంగా మారింది. జవహర్ నగర్‌లో సంవత్సర కాలంలో వందల అక్రమ నిర్మాణాలు వెలిశాయి. అంటే అధికారుల నిర్లక్ష్యం ఏ విధంగా ఉందో అర్థమవుతుందని ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ నిర్మాణాల పట్ల చర్యలు తీసుకోవాలనిజవహర్ నగర్ ప్రజలు కోరారు.

# ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు

- బొమ్మల కుంటలో కబ్జాలకు రక్షణగా యూపీ బీహార్ మాఫియా
- ప్రభుత్వ స్థలాన్ని సందర్శించిన అమీన్పూర్ బిజెపి అధ్యక్షులు ఈర్ల రాజు




**అమీన్‌పూర్, డిసెంబర్ 11 (నిఘా న్యూస్):** అమీన్పూర్ మండలం దయారా గ్రామ పంచాయతీ పరిధిలో బొమ్మలు కుంట రెవెన్యూకు సంబంధించిన సర్వే నంబర్ 30లో ప్రభుత్వ భూమిని కొందరు బడా బాబులు కబ్జా చేసి ప్లాట్లు వేసి ఇండ్లు నిర్మిస్తున్నారని ప్రచారం జరగడంతో అమీన్పూర్ భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు ఈర్ల రాజు ముదిరాజ్ ఆ ప్రాంతాన్ని సందర్శించారు. అక్కడున్న బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు సంబంధించిన వ్యక్తులతో మాట్లాడగా వారందరూ పొంతన లేని సమాధానం చెబుతున్నారు మిమ్మల్ని ఎవరు ఇక్కడ పెట్టారని అడిగితే సరైన సమాధానం చెప్పలేక దాటే వేసిన ధోరణితో మాట్లాడుతున్నారు. భూ కబ్జాదారులు బీహార్ ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల వ్యక్తులను ఇక్కడ ఉంచడం వల్ల ఈ ప్రాంత ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు గ్రామ ప్రజలు ఎవరైనా ఆ ప్రాంతానికి వెళ్లి వాళ్లని ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారు, ఇప్పటికైనా అమీన్పూర్ ప్రభుత్వ అధికారులు తాసిల్దార్ ఇక్కడ కట్టిన అక్రమ కట్టడాలను వెంటనే తొలగించాలి. యూపీ బీహార్ వ్యక్తులను ఇక్కడ నుండి పంపియాలని కోరుతూ ప్రభుత్వ భూమిని రక్షించాలని రెవెన్యూ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ బిజెపి మండల ప్రధాన కార్యదర్శి యోవమోర్చా మండల అధ్యక్షులు వెంకటేష్ బొమ్మలు కుంట బిజెపి భూత్ అధ్యక్షులు దేవేందర్ సింగ్ పాల్గొన్నారు.

# మోహన్ బాబును తక్షణమే అరెస్టు చేయండి

### జర్నలిస్టులపై దాడికి నిరసనగా టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ధర్నా



**కాప్రా, డిసెంబర్ 11 (నిఘా న్యూస్):** జర్నలిస్టులపై సినీనటుడు మోహన్ బాబు చేసిన దాడికి నిరసనగా మేడ్చల్ జిల్లా జర్నలిస్టులు ధర్నాకు దిగారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర కోశాధికారి మోతె వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో కాప్రా సర్కిల్ జర్నలిస్టులు నేరెడ్మెట్ లోని రాచకొండ పోలీసు కమిషనరేట్ కార్యాలయం ముందు ధర్నాకు దిగారు. మోహన్ బాబు డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. మోహన్ బాబును వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీ సుధీర్ బాబును కలిసిన జర్నలిస్టు ప్రతినిధి బృందం మోతే వెంకటరెడ్డి, డి.వెంకట్రామిరెడ్డి, టీ. మల్కయ్య, వేముల శంకర్ , ఏ.భాస్కర్ రెడ్డి, ఎండి అక్బర్ తదితరులు టీవీ 9 రిపోర్టర్ రంజిత్, టీవీ5 రిపోర్టర్, ఇతర జర్నలిస్టులపై దాడికి పాల్పడిన మోహన్ బాబుపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఈసీఐఎల్ చౌరస్తాలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ మోహన్ బాబుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జర్నలిస్టులపై దాడులకు పాల్పడితే ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. ఈ సందర్భంగా మోతె వెంకట్ రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులపై దాడి చేయడం అమానుషమన్నారు. వెంటనే మోహన్ బాబు జర్నలిస్టులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గం పరిధిలోని జర్నలిస్టులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అనారోగ్యంతో వృద్ధ దంపతుల ఆత్మహత్య



**ఉప్పల్, డిసెంబర్ 11 (నిఘా న్యూస్):** ఉప్పల్ సాయిరాం కాలనీలో వృద్ధ దంపతులు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానికుల పోలీసుల కథనం ప్రకారం సాయిరాం నగర్ కాలనీలో నివసించే దుర్వాసుల సూర్య నారాయణశాస్త్రి (60), జగదీశ్వరి (56) వృద్ధ దంపతులు విషం తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. వీరికి ఒక కుమారుడు అతను గచ్చిబౌలిలో ఉంటున్నాడు. ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో పక్కింటి వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆత్మహత్య చేసుకుని మూడు రోజులు జరుగుచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న దంపతులు మా చావుకి ఎవరు కారణం కాదని ఆత్మహత్య చేసుకున్నట్లు సూసైడ్ లెటర్ రాసి పెట్టారు. ఈ మధ్యనే షష్టిపూర్తి చాలా గ్రాండ్ గా చేసుకున్నారని స్థానికులు చెబుతున్నారు. సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఈ మేరకు ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

# ఒకే స్థలాన్ని ఇద్దరికి అమ్మిన వ్యక్తి అరెస్టు



**వేములవాడ, డిసెంబర్ 11 (నిఘా న్యూస్):** వేములవాడలోని ఒకె భూమిని ఇద్దరికి అమ్మిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ తెలిపారు కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. అశోక్ నగర్ కరీంనగర్ కు చెందినటువంటి బొద్దుల రాంనారాయణ వేములవాడలోని నందికమాన్ ప్రాంతంలో, సిరిసిల్ల అంబేద్కర్ నగర్ చెందినటువంటి సిరిగిరి రమేష్ దగ్గర 2004 సంవత్సరంలో 200చదరపుగజాల స్థలాన్ని కొని రిజిస్ట్రేషన్ చేసుకోగా గత నెల రోజుల క్రితం అతను తన ప్లాటు వద్దకు వెళ్లగా సిరిగిరి రమేష్ ఫోర్జరీ డాక్యుమెంట్లు ఉపయోగించి వేరే వారికి తన భూమిని విక్రయించాడని తెలిపారు. దీని గురించి సిరిగిరి రమేష్‌ని ప్రశ్నించగా తనపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు పెడతానని, అతని ప్లాట్ అతనికి కావాలంటే తనకు లక్ష రూపాయలు ఇవ్వాలని బెదిరించాడు. అతనికి భయపడి బొద్దుల రాంనారాయణ లక్ష రూపాయలు ఇచ్చాడు. మరల మరో 50వేల రూపాయలు ఇవ్వాలని బెదిరించాడు. లేకుంటే తనని తన కుటుంబ సభ్యులను చంపుతానని బెదిరించాడు. బొద్దుల రాంనారాయణ ఫిర్యాదు మేరకు వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి రిమాండ్ కి తరలించడం జరిగిందని పట్టణ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్ తెలిపారు. సిరిగిరి రమేష్ చేతిలో మోసపోయిన బాధితులు ఎవరైనా ఉంటే సంబంధించిన పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేస్తే చట్టరిత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని మోసాలకు పాల్పడిన వారిపై పిర్యాదు చేస్తే చర్యలుంటాయని కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

# ఉప్పల్‌లో అడ్డగోలుగా అక్రమ కట్టడాలు

- టౌన్ ప్లానింగ్ అధికారుల మౌనంపై అనుమానాలు
- చైన్ మెన్ లదే హవా..విచ్చల విడిగా వసూళ్లు



**ఉప్పల్, ఆగస్టు 11 (నిఘా న్యూస్):** ఉప్పల్ మున్సిపల్ సర్కిల్-2 పరిధిలో టౌన్ ప్లానింగ్ అధికారుల అండదండలతో అడ్డు అదుపు లేకుండా అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. లక్షలు దండుకుంటూ అక్రమ నిర్మాణాలకు ఆజ్యం పోస్తున్నారు. అక్రమ కట్టడాలపై ఫిర్యాదులు వచ్చిన నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. వారికి అండగా నిలుస్తూ అక్రమ కట్టడాలను ప్రోత్సహిస్తున్నారు. ఉప్పల్ సర్కిల్ పరిధిలోని ఉప్పల్, హబ్సిగూడ, రామంతపూర్, చిల్కానగర్ డివిజన్లో విచ్చలవిడిగా అక్రమ కట్టడాలు కొనసాగుతున్నాయి. అక్రమ నిర్మాణాలను పర్యవేక్షించాల్సిన చైన్ మెన్ లు తమకు అందినంత దండుకుంటూ మౌనంగా ఉంటూ నెలకు వేలాది రూపాయలు సంపాదిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొంతమంది చైన్ మెన్లపై ఇల్లు యజమానులు అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని ఆరోపణలు ఉన్నాయి. రామంతాపూర్ ఏడిఆర్ఎం హాస్పిటల్ లైన్‌లో నిబంధనలు పట్టించుకోకుండా ఇదేచ్ఛగా అక్రమ నిర్మాణం జరుగుతున్న పట్టించుకునే నాథుడే కరువయ్యారు. స్టిల్ట్ ప్లస్ టు పర్మిషన్ తీసుకోని కట్టడాలు మరోలా నిర్మిస్తున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులు ఆప్రూవల్ ఇచ్చిన తరువాత ఆ బిల్డింగ్ ఏ విధంగా కడుతున్నారు. ఎన్ని అంతస్తులు వేస్తున్నారని పర్యవేక్షణ చేయాలి. కానీ మూడుపునందుకొని తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

## నోటీసులకే పరిమితమైన అధికారులు

ఉప్పల్ మున్సిపల్ పరిధిలో ఉప్పల్, చిల్కానగర్, చిలుకానగర్, ఉప్పల్ బాగయత్, రెసిడెన్సియల్ పేరుతో పర్మిషన్ తీసుకుని కమర్షియల్ నిర్మాణం పెద్దపెద్ద బిల్డింగ్లు, షెడ్లు, అపార్టమెంట్లు అయితే నిబంధనలకు విరుద్దంగా నిర్మిస్తున్నప్పటికీ లక్షల్లో ముడుపులు తీసుకుని టౌన్ ప్లానింగ్ అధికారులు మౌనంగా ఉంటూ నోటీసులు ఇస్తూ చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. టౌన్ ప్లానింగ్ ఏసిపి ఇన్చార్జిగా ఉండటం వల్ల ఇక్కడ ఎక్కువ సమయం కేటాయించకపోవడం టౌన్ ప్లానింగ్ విభాగంలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది అండదండలతో అక్రమ కట్టడాలు యదేచ్ఛగా కొనసాగుతున్నాయి. ఇన్ని అక్రమాలు జరుగుతున్న కూడా విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులకు కనీసం అటువైపు కన్నెత్తి చూడడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా డిప్యూటీ కమిషనర్ స్పందించి ఉప్పల్ మున్సిపాలిటి పరిధిలో విచ్చలవిడిగా జరుగుతున్న అక్రమ నిర్మాణలపై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



రామంతాపూర్, హబ్సిగూడ డివిజన్లు అక్రమ నిర్మాణాలకు అడ్డాగా మారిపోయాయి. అనుమతులకు విరుద్ధంగా నిర్మిస్తున్న అక్రమ కట్టడాలపై స్థానిక ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేస్తే టౌన్ ప్లానింగ్ అధికారులు మాత్రం నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటూ నోటీసులు ఇచ్చేశాం అని చెప్పేసి తప్పించుకుంటున్నారు. అనేకమార్లు టౌన్ ప్లానింగ్ అధికారులపై ఏసీబీకి భవన నిర్మాణ యజమానులు ఫిర్యాదు చేసిన సందర్భాలు ఉన్నాయి. అయినా అధికారుల్లో మార్పు రావడం లేదు.

Printed Published by Ch.Srinivas, Printed at M/s Apsara Printing Works, H.No. G9 Ground Floor, Maruti Complex, Nagole Cross Road, Hyderabad, Telangana India - 500068.
Editor : Ch.Srinivas RNI Reg.No.APTEL/2010/35098. Phone: +91 90142 77465 email: nighareporters@gmail.com